APTEL/2023/88044

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

ఆంధ్రప్రదేశ్ / తెలంగాణ

సంపుటి : 01 | సంచిక : 234 | ఎడిటర్ : ఎం. రమేష్ | గురువారం, జులై 25, 2024 | పేజీలు : 08 | వెల రూ. 5.00/-



## అధికారుల పనితీరు మెరుగుపడాలి

### పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

### ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి,జూలై24(పీపుల్స్ మోటివేషన్): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని మంత్రులు, హెచ్‌వోడీలు, కార్యదర్శులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో 12 లక్షల మంది దుర్భరమైన పేదరికంలో ఉన్నట్టు సమావేశంలో పేర్కొన్నారు. వారందరినీ దాని నుంచి బయటపడేసేలా అమలు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి నిధులు రాబట్టే అంశాలపై సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీలతో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వ సమీక్షలన్నీ నిర్దేశిత సమయంలోగానే పూర్తయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు వినూత్న ఆలోచనలు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పరిపాలనపై ఫోకస్ పెట్టాలన్న చంద్రబాబు.. కేంద్ర నుంచి తెచ్చే ఏ ఒక్క రూపాయిని వదలకుండా పూర్తి స్థాయిలో కేంద్ర పథకాలను అధ్యయనం చేయాలని వెల్లడించారు. మూస ధోరణిలో కాకుండా వినూత్నంగా ఆలోచన చేయాలన్నారు. పరిపాలనలో భాగంగా అధికారులకు తన వైపు నుంచి 100 శాతం మద్దతు ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. అధికారులకు వీలైనంత వరకు హ్యాండ్ హోల్డింగ్ అందిస్తామన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే తానూ కఠినంగా ఉంటానని తెలిపారు. గంటల తరబడి సమీక్షలకు తాను స్వస్తి పలికానని, అధికారులు కూడా రిజల్ట్ ఒరియేంటెడ్ పద్ధతిలో సమీక్షలు చేపట్టాలని సూచించారు.

## సర్పంచ్ సంతకం ఫోర్జరీ

### నిధులు స్వాహాపై విచారణ ఆదేశించిన డిప్యూటీ సీఎం పవన్



**అమరావతి,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

నెల్లూరు జిల్లా ముత్తుకూరు సర్పంచ్ బూదూరు లక్ష్మి సంతకాన్ని ఫోర్జరీ చేసి పంచాయతీ నిధులు స్వాహా చేసిన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. మహిళా సర్పంచ్‌ను కులం పేరుతో దూషించి బెదిరింపులకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైకాపా నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, అతని అనుచరులు తన సంతకాలు ఫోర్జరీ చేసి దూషించారంటూ మహిళా సర్పంచ్ లక్ష్మి.. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో అసెంబ్లీ వద్దకు వెళ్లి డిప్యూటీ సీఎంకు.. - మిగతా 2లో..

## తుంగభద్రకు భారీగా వరద

### 10గేట్లు ఎత్తి నీటి విడుదల

కర్నూలు,జూలై24(పీపుల్స్ మోటివేషన్): ఎగువన ఎడతెరపిలేని వర్షాల కారణంగా కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి భారీగా వరద వస్తోంది. దాంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 10 గేట్లను ఎత్తారు. ఎగువ నుంచి భారీగా వరద పరవళ్లు తొక్కుతుండటంతో 10 గేట్లు ఎత్తి దిగువకు 18,686 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.ఇవాళ ఎగువ నుంచి తుంగభద్ర డ్యామ్‌కు 87,700 క్యూసెక్కుల ఇన్ ఎ÷-లో వస్తోంది. అవుట్ ఎ÷-లో 18,686 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ప్రస్తుతం డ్యామ్‌లో 98.961 టీఎంసీల నీరు నిల్వ ఉందని, 1631.28 అడుగుల మేర నీటి మట్టం ఉందని డ్యామ్ సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. ఎగువ నుంచి మరింత వరద వచ్చే అవకాశం ఉందని ఆయన చెప్పారు. అవసరమైతే మరిన్ని గేట్లు ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తామని వెల్లడించారు. తుంగభద్ర డ్యామ్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 100.788 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 98.961 శాతం టీఎంసీల నీరు నిలువ ఉన్నది. అదేవిధంగా డ్యామ్ పూర్తి నీటి మట్టం 1633 అడుగులు ..÷ూగా.. ఇప్పుడు ఆ నీటి మట్టం 1631.28 అడుగులకు చేరింది.

## నన్ను చంపేందుకు బిష్ణోయ్ గ్యాంగ్ కుట్ర

### క్రైమ్ బ్రాంచ్ పోలీసుల ముందు సల్మాన్ వాంగ్మూలం

**ముంబయి,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

నన్ను, నా కుటుంబాన్ని చంపేందుకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కుట్ర పన్నినట్లు తెలుస్తోందని బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ పేర్కొన్నారు. ఆ క్రమంలోనే తన ఇంటిపై కాల్పులు జరిపినట్లు అనుమానిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసుల ముందు ఆయన వాంగ్మూలం ఇచ్చారు. ఈ వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సల్మాన్ ఖాన్ ఇంటిపై కొందరు దుండగులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి పోలీసులు 1700లకుపైగా పేజీలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కాల్పులు జరిగిన ఏప్రిల్ 14వ తేదీన ఇంట్లోనే ఉన్నానని, తూటాల శబ్దంతోనే నిద్రలేచానని సల్మాన్ అందులో పేర్కొన్నారు. తెల్లవారుజామున 4.55కు ఇద్దరు సాయుధ దుండగులు బైక్‌పై వచ్చి, మొదటి అంతస్తు బాల్కనీపై కాల్పులు జరిపిన విషయాన్ని బాడీగార్డ్ వచ్చి తనకు చెప్పినట్లు వివరించారు. తనతోపాటు తన కుటుంబంపై గతంలోనూ దాడి ప్రయత్నాలు జరిగాయని ఖాన్ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి బాంద్రా పోలీస్ స్టేషన్‌లో తన బాడీగార్డ్ ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ దాడులకు తామే బాధ్యులమంటూ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్, అతడి సోదరుడు అన్మోల్‌లు ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన విషయాన్ని పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో తెలిపారు.

## ఆగస్ట్ 2వరకు అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఆగస్టు 2 వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ముందుగా 31 వరకే జరపాలనుకున్నా, అనేక అంశాలు చర్చించాల్సి ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గురువారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈనెల 26న అసెంబ్లీకి సెలవు, 27న బడ్జెట్ పద్దుపై చర్చ జరగనుంది. 28న ఆదివారం సెలవు ఉంటుంది. 29, 30 తేదీల్లో వివిధ బిల్లులు ప్రవేశపెట్టనున్నారు. 31న ద్రవ్యవినిమయ బిల్లు సభ ముందుకు తీసుకురానున్నారు. ఆగస్టు 1, 2 తేదీల్లో వివిధ బిల్లులు ప్రవేశపెట్టనున్నారు.

## కిమ్ ప్రభుత్వం దుందుడుకు చర్య



సియోల్: దాయాది దేశాలైన ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య ఎప్పుడూ ఉద్రిక్త వాతావరణమే ఉంటుంది. గత కొద్దికాలంగా వాటి మధ్య 'చెత్త బెలూన్ల' ఘర్షణ జరుగుతోంది.తాజాగా ఏకంగా దక్షిణ కొరియా అధ్యక్షుడి కార్యాలయంపైనే ఉత్తర కొరియా వ్యర్థాల బెలూన్లను జారవిడిచింది. అయితే వాటి కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లలేదని స్థానిక మీడియా వెల్లడించింది. ఈ బెలూన్ల రాకపై ముందే సమాచారం ఉన్నట్లు సైన్యం తెలిపింది. దక్షిణ కొరియా అధ్యక్షుడి కార్యాలయ ప్రాంగణంలో బుధవారం చెత్తతో ఉన్న బెలూన్లు పడిపోయాయి. అయితే వాటివల్ల ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. అయితే ముందుజాగ్రత్త చర్యగా పీపీఈ కిట్లు ధరించిన సిబ్బంది ఆ చెత్తను తొలగించారు. సియోల్ ఉత్తరం వైపు అవి ఎగురుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈరోజు ఉదయం దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. అమెరికా-దక్షిణ కొరియాల మధ్య బంధం విషయంలో ఉత్తరకొరియా కలవరపడుతూనే ఉంటుంది. దాంతో బెలూన్లతో గతకొద్దికాలంగా కిమ్ ప్రభుత్వం కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. అలాగే దక్షిణకొరియా కార్యకర్తలు తమ భూభాగంలో కరపత్రాలు వెదజల్లినందుకు ప్రతిగా.. ఉత్తరకొరియా సియోల్‌లోకి 'చెత్త' బెలూన్లను పంపుతోంది. మే నెల నుంచి రెండువేల బెలూన్లను పంపినట్లు తెలుస్తోంది. వాటికి ఉన్న బ్యాగుల్లో వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, బ్యాటరీలు, పాడైన షూలు, కాగితాలతో కూడిన చెత్త ఉంది. కొన్ని బెలూన్లలో మురుగుమట్టి, జంతు విసర్జన కూడా ఉండటం గమనార్హం. 2016లోనూ ఇలా కిమ్ సర్కారు బెలూన్లను పంపగా.. వాటి కారణంగా దక్షిణ కొరియాలో కొన్ని కార్లు, ఆస్తులు దెబ్బతిన్నాయి. ఉత్తర కొరియా చర్యలు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని, తమ ప్రజల భద్రతకు తీవ్ర ముప్పు కలిగించేవేనని గతంలో దక్షిణ కొరియా సైన్యం వెల్లడించింది. వీటివల్ల ఉత్పన్నమయ్యే అన్ని పర్యవసానాలకు కిమ్‌దే బాధ్యత అని పేర్కొంది. ఇలాంటి అమానవీయ, చిల్లర పనులను తక్షణమే ఆపాలని హెచ్చరించింది. తమ సహనాన్ని పరీక్షిస్తోందని వ్యాఖ్యానించింది.

## కమలా హారిస్ రాకతో అప్రమత్తమైన ట్రంప్ బృందం!



వాషింగ్టన్: డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా కమలా హారిస్‌కు మద్దతు ఊపందుకుంటున్న నేపథ్యంలో రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ ప్రచార బృందం అప్రమత్తమైనట్లు తెలుస్తోంది.హారిస్ రాకతో డెమోక్రాట్లలో కొత్త ఉత్సాహం నెలకొన్నట్లు పేర్కొంటూ ట్రంప్ వర్గం రహస్యంగా పార్టీ శ్రేణులకు ఓ లేఖ రాసింది. అప్రమత్తంగా ఉండాలని.. ఆమె వైఫల్యాలను ఎండగట్టాలని అందులో వివరించింది. గతకొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలు ట్రంప్‌నకు అనుకూలంగా మారాయని ప్రచార బృందంలోని కీలక సభ్యుడు టోనీ ఫ్యాబ్రీజియో లేఖలో పేర్కొన్నారు. సర్వేలన్నీ ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని వెల్లడించారు. కానీ, స్వల్పకాలంలో పోల్స్ అన్నీ హారిస్ వైపు మొగ్గుచూపే అవకాశం ఉందని తెలిపారు. తమ అభ్యర్థిని అధికారికంగా ఎన్నుకోవడానికి జరిగే డెమోక్రటిక్ పార్టీ జాతీయ సదస్సుకు ముందే ఇదే జరిగొచ్చని అంచనా వేశారు. దీన్ని హారిస్ బృందం సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తుందని స్పష్టంచేశారు. పోల్స్‌లో ఆధిక్యం కనబరిచినంత మాత్రాన హారిస్ గెలుస్తారని విశ్వసించాల్సిన అవసరం లేదని లేఖలో టోనీ వివరించారు. బైడెన్ హయాంలో ఆర్థిక వ్యవస్థ నెమ్మదించడం, అధిక ద్రవ్యోల్బణం, నేరాలు, సరిహద్దుల్లో చొరబాట్లు, పెరిగిన ఇళ్ల ధరలు, రెండు యుద్ధాలు వంటి విషయాలను ఓటర్లు మరవబోరని తెలిపారు. వీటన్నింటిలో బైడెన్‌కు సహాయకురాలిగా హారిస్ పాత్ర కూడా ఉంటుందనే విషయాన్ని విస్మరించబోరని పేర్కొన్నారు. మరోవైపు కమలాహారిస్‌పై ఎట్టిపరిస్థితుల్లోనూ నోరు జారొద్దని తమ సభ్యులకు రిపబ్లికన్ పార్టీ సూచించింది. ఆమెపై జాత్యహంకార, లింగ వివక్ష వ్యాఖ్యలు చేస్తే చిక్కుల్లో పడతామని తెలిపింది. అధ్యక్షుడు బైడెన్ పాలసీల్లో ఆమె వైఫల్యాలను మాత్రమే ప్రశ్నించాలని సూచించింది. వివాదాస్పద అంశాల జోలికి వెళ్లొద్దని హితవు పలికింది.

## లిక్కర్ స్కామ్ కారకులను వదిలిపెట్టొద్దు

### అసెంబ్లీలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

**అమరావతి,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

ఏపీలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ స్కాంపై అసెంబ్లీలో సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో లిక్కర్ అక్రమాలపై సీఐడీ విచారణకు ఆదేశాలు జారీ చేసారు. ఈ క్రమంలో వైసీపీ అధినేత జగన్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. శ్వేతపత్రంలో చెప్పినదానికంటే ఎక్కువ అక్రమాలు జరిగాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన లిక్కర్ అక్రమాల వల్ల రాష్ట్ర ఖజానాకు 18వేల కోట్ల నష్టం వాటిల్లిందని అన్నారు. తప్పు చేసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని అన్నారు పవన్ కళ్యాణ్. కేంద్ర బ్జడెట్ లో 15వేల కోట్లు వస్తేనే సంతోషించాం కానీ, 18వేల కోట్లు ఖజానాకు వచ్చి ఉంటే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదని అన్నారు. లిక్కర్ స్కాంకు కారకులైన ప్రతి ఒక్కరిని శిక్షించాలని సీఎంను కోరారు. తప్పులు చేసినవారిని వదిలేస్తే మనకు మాట్లాడే నైతిక హక్కు ఉండదని అన్నారు. 20వేలు లంచం తీసుకుంటున్న సామాన్య ఉద్యోగిని శిక్షించగలుగుతున్న మనం.. ఇంత భారీ స్కాంకు పాల్పడ్డవారిని వదిలిపెట్టొద్దని అన్నారు. పెద్దోళ్ళు తప్పు చేస్తే శిక్షలుండవా అని సామాన్యుడు ఫీల్ అవ్వకూడదని అన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

**అసెంబ్లీలో తీర్మానంపై చర్చలో మాటల యుద్ధం**
**కెసిఆర్‌ను ఏకి పారేసిన సిఎం రేవంత్**
**బిజెపితో పదేళ్లు అంటకాగి అన్యాయం చేశారని విమర్శలు**

**హైదరాబాద్,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెలంగాణ శాసనసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, భారాస ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. అవగాహనా రాహిత్యంతో కేటీఆర్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని సిఎం రేవంత్ అన్నారు. కీలకమైన చర్చ జరుగుతున్నప్పుడు కేసీఆర్ ఎందుకు రాలేదని సీఎం ప్రశ్నించారు 'మాకు జవాబు చెప్పండి చాలు. మీకు కేసీఆర్ అవసరం లేదు' అని కేటీఆర్ వ్యాఖ్యానించడంతో సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తండ్రి పేరు చెప్పుకొని నేను మంత్రిని కాలేదు. కింది స్థాయి నుంచి ఎదిగి ముఖ్యమంత్రిని అయ్యా. కేటీఆర్‌ది మేనేజ్‌మెంట్ కోటా అనుకున్నా. అంతకంటే దారుణం అని అన్నారు. ఆ వెంటనే కేటీఆర్ స్పందిస్తూ 'రేవంత్ పేమెంట్ కోటాలో సీఎం అయ్యారని మేమూ అనొచ్చు' అని వ్యాఖ్యానించారు. దానికి రేవంత్ మళ్లీ కౌంటర్ ఇస్తూ 'పేమెంట్ కోటాలో సీఎంను కాలేదు. మొన్న భారాస నేతలు దిల్లీ వెళ్లి చీకట్లో మాట్లాడుకొని వచ్చారు' అని వ్యాఖ్యానించారు. కేటీఆర్ స్పందిస్తూ 'మేనేజ్‌మెంట్ కోటాలో మంత్రి అయ్యానని సీఎం అనొచ్చా? సభా నాయకుడు అలా మాట్లాడొచ్చా?' అని ప్రశ్నించారు. ఆ తర్వాత మళ్లీ సీఎం రేవంత్ మాట్లాడుతూ కేసీఆర్‌పై విమర్శలు చేశారు. 'మాకేమీ అక్కర్లేదు.. మీ ప్రేమ చాలని చెప్పిన మనిషి కేసీఆర్. విద్యుత్‌పై రాష్ట్రంలో ఇప్పటి వరకు ఒక విధానమే లేదు. రూ.7లక్షల కోట్ల అప్పు చేసి వెళ్లిపోయారు. భారాస పదేళ్ల పాలనలో రాష్ట్రం దివాలా తీసింది. గత ప్రభుత్వ పరిపాలనలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. మీరేం చేశారో చూశాకే ప్రజలు తీర్పు ఇచ్చారు. భారాసకు అసెంబ్లీలో వచ్చిన మెజారిటీ లోక్‌సభ ఎన్నికల్లో రాలేదు. లోక్‌సభలో గుండుసున్నా దక్కినా తీరు మారకుంటే ఎలా?ఇప్పటికైనా రాష్ట్ర ప్రజల హక్కుల కోసం మాట్లాడాలని కోరుతున్నా' అని సీఎం అన్నారు. అనంతరం కేటీఆర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన చర్చను సమర్థిస్తున్నట్లు తెలిపారు. 'విభజన సమయంలో తెలంగాణ హక్కుల కోసం ఎంతో పోరాడాం. మోదీ సర్కారుపై తెలంగాణ కోసం అనేక పోరాటాలు చేశాం. రాష్ట్ర హక్కులు ఎవరు హరించినా వారి మెడలు వంచుతాం. యాచిస్తే ఏమీ రాదు.. శాసించి సాధించుకోవాలి. దిల్లీ తత్వం ఇంతకాలానికి కాంగ్రెస్‌కు బోధపడింది. భాజపాకు వ్యతిరేకంగా మాట్లాడుతుంటే మీకేం ఇబ్బంది కేంద్ర వివక్షను ఎండగట్టడంలో మేం సహకరిస్తాం. గతంలో కేంద్రం సాయం చేయకపోయినా ఎంతో అభివృద్ధి చేశాం. రేవంత్ రెడ్డి కష్టపడే ఈ స్థాయికి చేరుకున్నారు. చిన్నవయసులోనే సీఎం అయ్యారు. కేంద్రం తెచ్చిన అన్ని బిల్లులకూ మేం మద్దతివ్వలేదు. దళితుడు రాష్ట్రపతి, తెలుగు బిడ్డ ఉపరాష్ట్ర అభ్యర్థులుగా అయ్యే సమయంలో మద్దతిచ్చాం. కేసీఆర్‌ను కాదు.. ధైర్యముంటే మోదీని తిట్టండి. ఎన్నికలకు ఆరు నెలల ముందు రాజకీయాలు చేద్దాం. ఎన్నికల తర్వాత నాలుగున్నరేళ్లు ప్రజల గురించి ఆలోచిద్దాం. ఏం చేసినా బహిరంగంగానే చేశాం.. చీకటి ఒప్పందాలు మాకు అలవాటు లేదు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమీ ఇవ్వకుంటే మేమేం చేస్తాం అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తమకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ పవర్ సర్కిల్‌ను ప్రైవేటు వాళ్లకు ఇస్తున్నట్లు ఎక్కడా చెప్పలేదు. ఎవరో పత్రికల్లో రాసినదాన్ని పట్టుకుని సభలో మాట్లాడితే ఎలా? కేటీఆర్ సభతోపాటు రాష్ట్రాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. భారాస వాళ్లలా ఏది పడితే అది చేసేవాళ్లం కాదు. సింగరేణి అంశంపై చర్చించేందుకు మేం సిద్ధం అని భట్టి స్పష్టం చేశారు.తెలంగాణలో శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య మాటల యుద్ధం సాగింది. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరగడంపై జరిగని చర్చలో భాగంగా రేవంత్, కేటీఆర్ ఒకరిపై మరొకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సభలో ఉండి సహచర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో మాట్లాడించడంపై కేటీఆర్ విమర్శించగా.. రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని.. ప్రభుత్వం చాలా స్పష్టతతో ఉందని.. బ్జడెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై చర్చకు అనుమతించాలని కోరామని.. సభకు లేట్‌గా వచ్చిన సభ్యుడు అసలు విషయం తెలుసుకోకపోతే ఎలా అన్నారు. నాలుగు కోట్ల తెలంగాన ప్రజల హక్కుల గురించి సభలో చర్చ జరుగుతున్నప్పుడు 25 ఏళ్ల రాజకీయ అనుభవం ఉంది.. పదేళ్లు సీఎం అని చెప్పుకునే ప్రతిపక్ష నేత ఎక్కడ దాక్కున్నారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సభలో కనిపిస్తే ప్రధాని మోదీ ఏమనుకుంటారో అనే భయంతో కేసీఆర్ ఎక్కడో దాక్కున్నారంటే రేవంత్ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష సభ్యులు వివాదాల జోలికి వెళ్లకుండా సబ్జెక్ట్‌పై మాట్లాడాలని సూచించారు. సభలో ముఖ్యమైన అంశంపై చర్చ జరుగుతున్నప్పుడు సభను కేటీఆర్ తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. గాలివాటం మాటలను సభలో మాట్లాడుతున్నారని.. ఇప్పటికైనా ప్రతిపక్షం తమ పద్ధతిని మార్చుకోవాలని సూచించారు. ఢిల్లీ వెళ్లి చీకటి ఒప్పందాలు చేసుకున్నారని.. సభలో ఆ చీకటి ఒప్పందాల గురించి చెప్తారా.. లేదా బడ్జెట్‌పై ఇంకేమైనా వాళ్ల అభిప్రాయం చెబుతారో తెలుసుకోవడానికి చర్చను ప్రారంభించామన్నారు. ఇప్పటిరవకు కేటీఆర్ పేమెంట్‌కోటా అనుకున్నానని.. కానీ ఇప్పుడే ఆయన అబ్సెంట్ ల్యాండ్ లార్డ్ అని తేలిందన్నారు. మా నాన్న మాకు చదువు లేకపోయినా మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. తాము స్వయం కృషితో రాజకీయాల్లో ఎదిగామన్నారు. జడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీగా పనిచేశానని.. తాను తండ్రిని అడ్డుపెట్టుకుని మంత్రి అవ్వలేదన్నారు. అవతలి వారిని కించపర్చాలనే ఉద్దేశంతో అహంకారపూరితంగా మాట్లాడటం సరికాదన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కేంద్రంలోని మోదీ తీసుకున్న అన్ని నిర్ణయాలకు మద్దతు తెలిపారన్నారు. జిఎస్టీ, రైతు చట్టాలపై కేంద్రంలో బీజేపీకి కేసీఆర్ మద్దతు తెలిపారన్నారు. తెలంగాణను అప్పులలోకి నెట్టిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. మోదీతో పదేళ్లపాటు స్నేహం చేసిన కేసీఆర్.. ఇప్పుడు కాంగ్రెస్‌ను దోషిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ తెలంగాణ హక్కుల కోసం మాట్లాడితే ప్రజలు విశ్వసిస్తారని.. లేదంటే ప్రజలు బీఆర్‌ఎస్ నాయకులను క్షమించబోరన్నారు. ఎన్నో రకాల జబ్బులు ఉన్న వ్యక్తి.. నేను ఎంతో ఆరోగ్యంగా ఉన్నా.. తనకు పెళ్లికి పిల్ల కావాలని అడిగినట్లు బీఆర్‌ఎస్ తీరు ఉందన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి పాపాలు పొగొట్టుకోవడానికి తీర్థయాత్రలు చేసినట్లు బీఆర్‌ఎస్ పరిస్థితి ఉందన్నారు.

# తెలంగాణ బిజెపి నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలి !

నిస్సిగ్గుగా..నిర్లజ్జగా తెలంగాణ పట్ల చూపిన విక్ష గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. నిజంగానే మోడీ తెలంగాణ పట్ల కక్షసాధింపు చాటుకున్నారు. ఒక్క పైసా కూడా కేటాయింపులు లేకుండా కొన్ని రాష్ట్రాలను నిర్లక్ష్యం చేశారు. బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం చేశారు. ఇందులో నూటికినూరు శాతం నిజం. కేవలం ఎన్‌డిఎ భాగస్వామ్య రాష్ట్రాలకు మాత్రమే మేలు కలిగేలా తీసుకున్న నిర్ణయాలు సరికాదు. నిజానికి తెలంగాణ లేదా ఏ రాష్ట్రం అభివృద్ధి చెందినా అది దేశం అభివృద్ధికిందకే లెక్క. కానీ అలాంటి ప్రతిపాదనలు తెలంగాణ విషయంలో ఏమీ జరగలేదు. సిఎం రేవంత్, మంత్రులు పలుమార్లు ఢిల్లీ చుట్టు తిరిగి వినతిపత్రాలు సమర్పించినా..సున్నా చూపారు. కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎలా ఉన్నా తెలంగాణకు మాత్రం తీవ్ర అన్యాయం చేశారు. కీలకమైన రంగాలు వేటికీ ఘనమైన కేటాయింపులు జరపలేదు. ఎన్నో ఆశలతో ఇచ్చిన వినతిపత్రాల ను చిత్తు కాగితాల కింద మార్చినట్లుగా కనిపిస్తోంది. తెలంగాణకే కాదు దేశం మొత్తం మీద కేటాయింపులు సరిగా లేదు. పేదలను గట్టెక్కించే ప్రయత్నాలు జరగలేదు. ధరలు ఎలా తగ్గించాలో చెప్పలేదు. ధరల పెరుగుదలకు కారణమై, సామాన్యుల దైనందిన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్న ద్రవ్యోల్బణాన్ని అరికట్టటానికి ఏ చర్యలూ ప్రకటించలేదు. ఈ దశాబ్ది ఆఖరికి పదికోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామని ఘనంగా పేర్కొన్నా- అందుకు తగిన కార్యాచరణ, నిధుల కేటాయింపూ కనపడలేదు. ఉపాధి అనుసంధాన ప్రోత్సాహక పథకం యజమానులకు ఉపయోగపడుతుంది తప్ప ఉద్యోగార్థులకు పెద్దగా మేలు చేసేది కాదు. యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తారు సరే ..శిక్షణానంతరం ఉద్యోగాల మాటేమిటి? అన్న ప్రశ్నకు ఈ బడ్జెట్‌లో సమాధానం లేదు. ఏడాదికి సగటున 78.5 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామన్న మంత్రి మాట, గతంలో మోడీ ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ వలె డొల్లగా కనిపిస్తోంది. వ్యవసాయ రంగం మీద, ఉపాధి హామీ పథకం మీదా గతంలో మాదిరిగానే మోడీ ప్రభుత్వపు చిన్నచూపు కొనసాగింది. ఎరువుల రాయితీని మరింత తగ్గించి, రైతులకు ద్రోహం చేసింది. గ్రామీణ వ్యవసాయ కార్మికులకు, చిన్న రైతులకు, పేదలకు తోడ్పాటునిస్తున్న ఉపాధి హామీకి నిధులను తెగ్గోసింది. గత బడ్జెట్‌తో పోలిస్తే ఎరువుల సబ్సిడీలో రూ.24,894 కోట్లు, ఆహార సబ్సిడీలో రూ.7082 కోట్లు కోత పెట్టారు. పాలమూరు-రంగారెడ్డి విషయం పేర్కొనలేదు. ట్రిపుల్ ఆర్ గురించి మాట్లాడలేదు. ఓ పక్క ఎపికి రూ.15 వేల కోట్ల నిధులతో పాటు రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు, రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించిన కేంద్రం, కానీ, తెలంగాణకు మాత్రం హైదరాబాద్ టు బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి అత్తెసరు నిధులు మినహా మరెక్కడా తెలంగాణకు నిధుల ప్రస్తావన తీసుకురాలేదు. అయితే, హైదరాబాద్ టు బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌కు సంబంధించి తెలంగాణ పరిధి 150 కిలో మీటర్లు మాత్రమేనని దీనివల్ల పెద్దగా ఒనగూరే ప్రయోజనం లేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. దీంతోపాటు తెలంగాణలోని ప్రాజెక్టులను జాతీయ హోదా ఇవ్వాలని 10 ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నా ఆ దిశగా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణం. గత 10 ఏళ్లుగా ప్రతి బడ్జెట్‌లోనూ తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపుతుండడం, ఈబడ్జెట్ లో కూడా తెలంగాణకు మళ్లీ భంగపాటే ఎదురుకావడంతో సిఎం రేవంత్, మంత్రులు, దీనిపై అసెంబ్లీలో చర్చించాలని నిర్ణయించారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి బిజెపికి చెందిన ఎంపిలను ఎనిమిది మంది గెలిపించినా రాష్ట్రానికి నరేంద్ర మోడీ నిధులు కేటాయించకపోవడం దారుణం కాక మరోటి కాదు. కేంద్ర బడ్జెట్‌లో ఎపి రీ ఆర్గనైజేషన్ యాక్ట్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించినా ఆ యాక్ట్ పరిధిలోకి వచ్చే తెలంగాణ పేరు మాత్రం ప్రస్తావించలేదు. బిజెపి మిత్రపక్ష పార్టీలైనా జేడీయూ, టిడిపి పాలిత రాష్ట్రాలైన బీహార్, ఎపిలకే ప్రధాని మోడీ అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఎపి రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అందజేయనుండగా రాబోయే సంవత్సరాల్లో మరింత ఆర్థిక సాయం అందిస్తామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. దీంతోపాటు పోలవరం ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి తమవంతు కృషి చేస్తామని కేంద్రం హామి ఇవ్వడం విశేషం. రీ ఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం ఎపిలో పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటునందించడంతో పాటు విశాఖపట్నం టు చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు తోడ్పాటు, కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్‌కు అవసరమైన మౌలిక వసతులన్నీ కల్పిస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. ఆర్థిక ప్రగతికి దోహదం చేసే పారిశ్రామిక కారిడార్లకు ఈ ఆర్థిక సంవత్సరంలో అదనపు నిధులు కేటాయిస్తామని కేంద్రం సూచించింది. తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలకు ఇదే కోటాలో నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా కేంద్రం మాత్రం కనీసం పట్టించుకోలేదు. తెలంగాణ లోని ఏ ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఏఐబిపి స్కీంలోకి తీసుకోకపోవడం విశేషం. తెలంగాణకు ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం ఒక్క కొత్త ప్రాజెక్టును ప్రకటించలేకపోవడం విశేషం. సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్, వరంగల్ టెక్స్ టైల్ పార్కుకు ఆర్థిక సాయం, తెలంగాణలోని ఇండస్ట్రియల్ కారిడార్లకు నిధులు ఇవ్వడంలో కేంద్రం మొండిచేయి చూపింది. ఎపి రీ ఆర్గనైజేషన్ యాక్ట్‌లో హామీ ఇచ్చిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావనే లేకపోగా, ములుగు ట్రైబల్ యూనివర్సిటీకి అదనపు నిధుల అంశంతో పాటు తెలంగాణకు జాతీయ విద్యా సంస్థల కేటాయింపులకు సంబంధించి ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. ఈ విషయంలో బిజెపి ఎంపిలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. తెలంగాణ కోసం ఏమి చేయదల్చుకున్నారో చెప్పాలి. అవసరమైతే కేంద్రంతో కొట్లాడి తెలంగాణ ఆత్మగౌరవం చాటాలి.

## సర్పంచ్ సంతకం ఫోర్జరీ

మొదటి పేజీ తరువాయి

ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో సర్పంచులను నామ మాత్రం చేసిన వైసీపీ పాలకులు, వారి అనుచరులు పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారని డిప్యూటీ సీఎం మండిపడ్డారు. ఎన్డీయే పాలనలో కచ్చితంగా పంచాయతీలను బలోపేతం చేస్తామని అన్నారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, వైసీపీ నాయకులు మహిళా సర్పంచ్‌ను బెదిరించి, కుల దూషణ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ బూదూరు లక్ష్మి తనకు ఫిర్యాదు చేసినట్లు పవన్ చెప్పారు. ఆమె సంతకం ఫోర్జరీ చేసి కోట్ల రూపాయలు స్వాహా చేసిన ఘటనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.సర్పంచ్ లక్ష్మి ఐదేళ్ల పాలనలో ఎన్నో ఇబ్బందులు, అవమానాలు పడిన విషయం ఆమె మాటల్లో తెలుస్తోందని డిప్యూటీ సీఎం పవన్ అన్నారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఆమెను మాజీ మంత్రితో కుమ్మక్కై వైకాపా నాయకులు, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కులదూషణ చేసి వేధింపులకు పాల్పడ్డారని ఆయన మండిపడ్డారు. ఊరి నుంచి వెళ్లిపోవాలని బాధితురాలని బెదిరించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోర్జరీ సంతకాలు చేసి నిధులు స్వాహా చేశారని, దీనిపై వెంటనే పూర్తి వివరాలు అందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఘటనపై విచారణ చేపట్టి తగిన న్యాయం చేస్తామని మహిళా సర్పంచ్‌కు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

## రాజధాని ప్రాంతంలో నిర్మాణాలపై మరో కీలక నిర్ణయం

### నిలిచిపోయిన నిర్మాణాలపై టెక్నికల్ కమిటీ ఏర్పాటు

**అమరావతి,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

రాజధాని ప్రాంతంలో నిర్మాణాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని ప్రాంతంలో నిలిచిపోయిన నిర్మాణాల స్థితిగతులపై సాంకేతిక నిపుణులతో కమిటీని నియమించింది.. వివిధ శాఖలకు చెందిన ఇంజనీర్లతో సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసింది.. ప్రజారోగ్యశాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ చైర్మన్ గా సాంకేతిక కమిటీని నియమించింది.. కమిటీలో సభ్యులుగా రహదారులు భవనాలు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, ఏపీ సీపీడీసీఎల్, ఏపీ సీఆర్డీఏ, ఏడీసీ సంస్థలకు చెందిన చీఫ్ ఇంజనీర్లు ఉన్నారు.. ఇక, విజిలెన్స్ ఎన్ ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ నుంచి ప్రతినిధిని కూడా కమిటీలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.. రాజధాని ప్రాంతంలో చేపట్టి వేర్వేరు నిర్మాణాలను పరిశీలించాలని సాంకేతిక కమిటీకి ఆదేశాలు జారీ చేసింది రాష్ట్ర ప్రభుత్వం.. నిలిచిపోయిన నిర్మాణ పనులు ఎక్కడి నుంచి ప్రారంభించాలన్న అంశంపై సూచనలు చేయాలని సాంకేతిక కమిటీకి ఆదేశాలు ఇచ్చింది.. దీంతో.. రాజధాని ప్రాంతంలో నిర్మాణాలపై పూర్తిస్థాయిలో పరిశీలించి. వివిధ నిర్మాణాల పటిష్టత.. స్థితిగతులను తెలుసుకుని.. ప్రభుత్వానికి సిఫార్సులు చేయనుంది సాంకేతిక కమిటీ.. రాజధాని అమరావతిలో రహదారుల విధ్వంసం, పైపులైన్లు తదితర అంశాలను కూడా సాంకేతిక కమిటీ పరిశీలించనుంది. కాగా, గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో అమరావతిలో నిర్మాణాలు జరిగాయి.. అయితే, వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. ఆ నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిపివేశారు.. మరోవైపు.. మూడు రాజధానులపై నిర్ణయం తీసుకుంది వైఎస్ జగన్ సర్కార్.. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో కూటమి తిరుగులేని విజయాన్ని అందుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత.. మళ్లీ అమరావతి రాజధానిలో నిర్మాణలపై ఫోకస్ పెట్టింది.. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటించి.. ఆయా కట్టడాలను సీఎం చంద్రబాబు పరిశీలించిన విషయం విదితమే. మరోవైపు.. తాజాగా కేంద్ర బ్జడెట్‌లో ఏపీ రాజధాని కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో.. రాజధాని ప్రాంతంలో నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలన్న పట్టుదలతో ముందుకు సాగుతోంది ఏపీ సర్కార్.

## ఆదాయా పెరిగినా అభివృద్ధి శూన్యం

**బడ్జెట్ కేటాయింపుల తీరుపై సర్వత్రా విమర్శలు**

**న్యూఢిల్లీ,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

కేంద్ర ప్రభుత్వ ఆదాయంలో పెరుగుదల 14.5 శాతం మేర ఉండగా, వ్యయంలో పెరుగుదల 5.94 శాతం మాత్రమే! పెరిగిన ఆదాయాన్ని ఆర్థిక కార్యకలాపాల విస్తరణకు ఉపయోగిస్తే- యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కానీ, ఈ బడ్జెట్లో ఆ మొత్తాన్ని జిడిపిలో ఆర్థికలోటు తగ్గించే అంకెల విన్యాసం వైపు మళ్లించారు. ఇది కార్పొరేట్లను,అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిదారులను సంతృప్తపరిచే చర్యే తప్ప- దేశ ప్రజలకు దోహదపడేది కాదు. ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రాలకు జరిపే నిధుల కేటాయింపు బిజెపి హయాంలో అంతకంతకు కుదించుకుపోతోంది. 2022 బ్జడెట్‌తో పోలిస్తే ఈసారి ఏకంగా రూ.40 వేల కోట్లకు ఎగనామం పెట్టేశారు! ప్రతిపక్షాల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలకు మరింత ద్రోహం చేయటానికి ఇది దారి తీయొచ్చు! ప్రభుత్వరంగంలోని రూ.50 వేల కోట్ల మేర వాటాల ఉపసంహరణకు ప్రతిపాదించటం మరీ దారుణం. ఈసారి కూడా కేటాయింపుల్లో తీరని ద్రోహం జరిగింది. గొప్ప సాయం అందిస్తున్నట్టు ప్రసంగంలో ప్రవచించినా, నిజంగా చూపిన ప్రేమ శూన్యం. ఎపి విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని నెరవేర్చటానికి నిర్దిష్టమైన ప్రస్తావన కానీ, కేటాయింపులు కానీ చేయలేదు. రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్ల నిధులను అంతర్జాతీయ ద్రవ్య సంస్థల ద్వారా రుణం తీసుకోవటానికి సాయపడతామని చెప్పారే కానీ, గ్రాంటుగా ఒక్క రూపాయి కూడా విదిలించలేదు. ఈ అప్పును ఎవరు చెల్లిస్తారో, వడ్డీని ఎవరు భరిస్తారో స్పష్టత లేదు. అప్పు ఇప్పించటమే ఒక ఘనమైన సహాయం అని కేంద్రం మభ్యపెట్టదలిస్తే అది రాష్ట్ర ప్రజలతో క్రూర పరిహాసమే! పోలవరం ప్రాజెక్టు గురించి గొప్ప ప్రస్తావనలు చేసినా, నిధుల కేటాయింపు మీద కానీ, నిర్వాసితులకు పునరావాసం మీద కానీ ఒక్క మాటా లేదు. విశాఖ రైల్వే జోనూ, కడప స్టీలు ఫ్యాక్టరీ ఊసే లేదు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరించ బోమని ఆ మధ్య కేంద్ర మంత్రి కుమారస్వామి విశాఖలో కుంటి తుడుపు ప్రకటన చేశారు కానీ, ఈ బ్జడెట్లో అలాంటి భరోసా ఏమీ ఇవ్వలేదు. వెనకబడిన జిల్లాలకు సహాయం జాబితాలో ప్రకాశంను కూడా కలపటం హర్షించదగ్గదే కానీ, కొద్దిపాటి విదిలింపు నిధులతో ఒరిగేదేమీ ఉండదు. ఈ బ్జడెట్ ద్వారా రాష్ట్రానికి మేలు జరిగిపోయినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేయడం తొందరపాటే అవుతుంది. విభజన హామీలను అమలు జరపటం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. రాజధాని నిర్మాణానికి, పోలవరం పూర్తికి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకూ తగినన్ని నిధులు పొందటం మన హక్కు. గట్టిగా అడిగి, పోరాడి సాధించాలి. లేదంటే ఇలాంటి ప్రసంగాల ప్రహసనాలతో, అంకెల గారడీలతో మళ్లీ మళ్లీ మోసపోతూనే ఉంటాం. రాష్ట్ర విభజన జరిగి, పదేళ్లు గడిచిపోయాక కూడా 'అన్ని హామీలూ అమలు చేస్తా'మన్న దగ్గరే బిజెపి ప్రభుత్వం ఆగిపోవటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు.

## మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలి

**న్యూఢిల్లీ,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

ధాన్యానికి ఇచ్చే మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించే విషయంలో ఇండియా కూటమి తరపున కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 12 మంది రైతు సంఘాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. అయితే, రైతుల్ని లోపలికి అనుమతించే విషయంలో గందరగోళం నెలకొంది. తనను కలిసేందుకు వచ్చిన రైతులను పార్లమెంటులోకి పర్మిషన్?ఇవ్వలేదని రాహుల్ ఆరోపించారు. వారిని తన కార్యాలయానికి తానే ఆహ్వానించినట్లు వెల్లడించారు. రైతులు కావడం వల్లే వారిని లోనికి పంపలేదన్నారు. రైతు సంఘాల నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికీ రైతులకిచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి పాదయాత్రగా వస్తామని చెప్పారు.

తెలుగు దినపత్రిక

# పీపుల్స్ మోటివేషన్

People's Motivation

గురువారం । జులై । 25 । 2024




# ఏపీ రాష్ట్ర నీటి హక్కులను కాపాడుతాం





**రాయలసీమ నీటి సమస్యల పరిష్కారానిపై సమగ్రమైన చర్యలు చేపడుతాం**

**మంత్రి నిమ్మల రామానాయుడు**

**అమరావతి, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖామాత్యులు ఎన్ఎండీ ఫరూఖ్ ఆద్వర్యంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, ప్రచార కార్యదర్శి నిట్టూరు సుధాకర్ రావు లు జలవనరుల శాఖామాత్యులు నిమ్మల రామానాయుడిని బుధవారం శాసనసభా ప్రాంగణంలో కలిసారు. ఆంధ్రప్రదేశ్ సాగునీటి హక్కులకు మరీ ముఖ్యంగా రాయలసీమ జిల్లాలు, నెల్లూరు, నాగార్జునసాగర్ ఆయకట్టుకు సంబంధించి సాగునీటి హక్కులకు విఘాతం కలిగించే విధంగా కేంద్రం తెచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ఎస్.వో.4375(ఈ) తేదీ 6.10.2023, రద్దుకు కృషి చేయాలని జలవనరుల శాఖామాత్యులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై తగిన కార్యాచరణ చేపడతామని మంత్రి సానుకూలంగా స్పందించారు. రాయలసీమ సాగునీటి హక్కుల పరిరక్షణకు కీలకమైన విధాన పరమైన నిర్ణయాలు, రాయలసీమ హక్కుగా ఉన్న నీటిని పొందడానికి అవసరమైన మౌళిక మైన నిర్మాణాలకు సంబంధించిన వినతి పత్రంను బొజ్జా మంత్రికి ఈ సందర్భంగా అందచేసారు. రాయలసీమ అంశాలపై జలవనురుల శాఖ మంత్రి సమగ్రంగా చర్చించడానికి సానుకూలంగా స్పందించారు. దీనికై జలవనురుల శాఖ మంత్రి మరియు రైతులతో ఒక సమావేశాన్ని త్వరలో ఏర్పాటు చేపడతానని న్యాయ శాఖ మంత్రి ఫరూక్ హామి ఇచ్చారు.

# వచ్చే విద్యా సంవత్సరం లోపు ఆదోని మెడికల్ కళాశాల నిర్మాణాల పనులు పూర్తి కావాలి





**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

**కర్నూలు, జూలై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

వచ్చే విద్యా సంవత్సరం లోపు ఆదోని మెడికల్ కళాశాల నిర్మాణాల పనులు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని సమీపంలో జరుగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మెడికల్ కళాశాల సమగ్ర స్వరూపం, నీటి సరఫరా, తదితర అంశాలను మ్యాప్ ద్వారా పరిశీలించి, వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు..కళాశాల పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఆదోని మెడికల్ కళాశాల నిర్మాణాలను పరిశీలించామని తెలిపారు..మెడికల్ కళాశాల కు సంబంధించి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రెండు విభాగాలు పూర్తి అయ్యాయన్నారు. వీటితో పాటు హాస్టళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, వీటిలో ఒకటి పూర్తి కాగా, ఇంకొకటి పైకప్పు స్థాయి వరకు వచ్చిందన్నారు.. రానున్న విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ ను అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించామన్నారు. కళాశాలకు అవసరమైన నీటి సరఫరా కోసం 30 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సమర్పించడం జరిగిందని, అందుకు సంబంధించిన అనుమతులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. అదే విధంగా కళాశాల నిర్మాణాలు పూర్తయిన తదుపరి కేంద్ర బృందం పరిశీలించి, విద్యాసంవత్సరం ప్రారంభా నికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు..అనంతరం జిల్లా కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్ మెడికల్ కళాశాల ఆవరణంలో మొక్కలను నాటారు. జిల్లా కలెక్టర్ వెంట ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఏపిఎంఎస్ఐడిసి ఈఈ శ్రీనివాసరెడ్డి, ఆదోని తహశీల్దార్ హసీనా సుల్తానా, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి ఏకైక రాజధాని అమరావతే

**రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయి**

**పత్రికా సమావేశంలో వివరాల వెల్లడించిన: మర్రెడ్డి**

**పిఠాపురం, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గత ప్రభుత్వం లో వెనుకబడిపోయి ఉందని రాజధాని లేని రాష్ట్రం గా ఆంధ్రప్రదేశ్ మిగిలిపోయిందని గత ప్రభుత్వం మూడు రాజధానులు అని తెరపైకి తీసుకువచ్చి కాలం గడిపింది తప్ప ఏమి చేయలేదని అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు గాలికి వదిలేసిందని వాటిని ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి 15 వేల కోట్ల రూపాయలు పార్లమెంట్ సాక్షిగా కేటాయింపు జరిగిందని జనసేన పార్టీ పిఠాపురం ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు బుధవారం ఉదయం పిఠాపురం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నిర్వహించిన పత్రికా సమావేశంలో తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవ తో కేంద్రం పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిందని అదేవిధంగా మన రాష్ట్రానికి ఏకైక రాజధాని అమరావతిని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కి వారు కేటాయించిన కేటాయింపుల మీద నరేంద్ర మోడీ కృతజ్ఞతలు తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. మీ అందరికీ తెలుసు గత పది సంవత్సరాలుగా కూడా కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ కి ఏనాడు కూడా న్యాయం జరగలేదు ప్రభుత్వం మారింది ఎన్నో ఆశలతోనే ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పడింది మన ప్రభుత్వాన్ని అదేవిధంగా కేంద్రంలో కూడా ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటయింది. ఆంధ్రప్రదేశ్ ఇవాళ వెన్నుముకగా నిలిచింది దానికి జవాబుగా ఆంధ్రప్రదేశ్ 10 సంవత్సరాల తర్వాత మొట్టమొదటిసారిగా కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ కి సామాజిక న్యాయం లభించిందని ఎందుకు అనుకుంటున్నాం అంటే గత పది సంవత్సరాల్లో ఎంత నగదు అయితే బడ్జెట్ గా కేటాయించారు దానికి సరి సమానంగా మొట్టమొదటి బడ్జెట్ లోనే అంత పెద్ద ఎత్తుగా కేటాయింపులు జరిగాయి నిన్నటి రోజున శాసనసభలో స్వయంగా ముఖ్యమంత్రి అయినటువంటి నారా చంద్రబాబునాయుడు చెప్పారు మేము ఏడు అంశాల మీద వారిని అభినందించడం జరిగింది మిగతా ఆరు అంశాలు కూడా పరిగణంలోకి తీసుకొని కేటాయింపులు చేశారని చెప్పడం జరిగింది. ఇందులో మొట్టమొదటిసారిగా మొట్టమొదటిగా అమరావతి అభివృద్ధికి 15 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించడం జరిగింది చాలా ఉత్సాహంతో మా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఎంత పెద్ద బడ్జెట్ కేటాయించి నేరుగా డబ్బు ఇవ్వడమే కాదు ఆంధ్రప్రదేశ్ కి రాజధాని అమరావతి ముక్త కంఠంతో చెప్పడం వంటి ఎన్డీఏ ప్రభుత్వానికి మా ధన్యవాదాలు తెలియజేస్తున్నాం అని జనసేన పార్టీ అధ్యక్షులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా నిన్న శాసనసభలో చెప్పడం జరిగింది ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి ఇన్ని సంవత్సరాలు అయ్యింది ఇవాల్టికి కూడా ఒక రాజధాని లేని పరిస్థితిలో మనం ఉన్నాం మొట్టమొదటిసారిగా కర్నూల్ అన్నారు తర్వాత విశాఖపట్నం అన్నారు అవి వైసిపి ప్రభుత్వం వాటిని అమలు చేయలేదని మర్రెడ్డి తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పిల్లా శివశంకర్ బొజ్జ లోవరాజు సతీష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టీకాలు తప్పనిసరి

**టీబీ నోడల్ పర్సన్ జయప్రకాష్**



**రాజోలి/ జోగులాంబ గద్వాల, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

గర్భిణీ స్త్రీలకు, శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టిబి నోడల్ పర్సన్ జయప్రకాష్ చెప్పారు. బుధవారం ఆయన రాజోలి మండల కేంద్రము లోని ఆరోగ్య ఉపకేంద్రం ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త గర్భిణీ స్త్రీలను, శిశువులను టీకా కేంద్రము నకు తరలించి టీకాలు ఇప్పించాలని ఆయన అన్నారు, వ్యాధి నిరోధక టీకాలు టీకాలు తీసుకున్న వారికి రెండవ డోస్ ఎప్పుడు, ఎక్కడ వేయించుకోవాలో తదితర వివరాలు వారికి చెప్పాలని ఆయన అన్నారు. గర్భిణీ స్త్రీలు కాన్పు ఇంటి దగ్గర కాకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు కావాలన్నారు. అప్పుడే తల్లి బిడ్డా క్షేమంగా ఆరోగ్యంగా ఉంటారని ఆయన మాట్లాడుతూ తెలిపారు. ఈ కార్యక్రమం లో హెల్త్ అసిస్టెంట్ రంజిత్ కుమార్, ఏ ఎన్ ఎం మద్ధమ్మ, ఆశా లు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి సముచిత స్థానం కల్పించారు

**టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి**

**డోన్, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**



మంగళవారం కేంద్రం పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు కేంద్ర ప్రభుత్వం "ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు" చొరవతో ఆంధ్ర ప్రదేశ్ కు పెద్ద ఎత్తున అమరావతి నిర్మాణానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.15 వేల కోట్లు రూపాయలు పోలవరం ప్రాజెక్టు పూర్తి నిధులు ఇస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం సంతోషకరమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి అన్నారు. ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ లో మౌలిక వసతులకు నిధులు ఇస్తామని, రాయలసీమ ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించడం అభినందనీయమని అన్నారు ఇదంతా మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కృషి వల్లే సాధ్యమైందని అన్నారు. రాష్ట్ర అవసరాలను గుర్తించి రాజధాని, పోలవరం, పారిశ్రామిక రంగాలపై దృష్టి సాధించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి , కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కి ధన్యవాదాలు తెలిపారు.

# మా గ్రామానికి విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటుచేయండి




**హొలగుంద/ కర్నూలు, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

బుధవారం హొళగుంద మండల పరిధిలోని పెద్దహ్యాట గ్రామనికి చెందిన విద్యార్థులు గ్రామస్తులు బస్సు సౌకర్యం కల్పించాలని డిప్యూటి తహశీల్దార్ నిజాముద్దీన్ గారికి వినతిపత్రం అందజేస్తారు. పెద్దాహ్యాట నుండి హొళగుంద పాఠశాల,కళాశాలకు విద్యాభ్యాసం కొరకు సుమారు.50 మంది పైగా విద్యార్థులు,కాలినడకన,పోను 8 కిలోమీట రాను 8 కిలోమీటర్లు మొత్తం 16 కిలోమీటర్ల నడిచి రావల్సిన పరిస్థితి ఏర్పడింది.దీంతో విద్యార్థినిలు,స్థానిక పాఠశాలలో (పెద్దహ్యాట) 5 వ తరగతి వరకే చదువు చాలస్తున్నారు.పై తరగతులకు హొళగుందకు బస్సు సౌకర్యము లేకపోవడంతో విద్యార్థినిల తల్లిదండ్రులు, అమ్మాయిలను పొలం పనులకు.తీసుకెళ్తున్నారు. దీంతో విద్యార్థినిలు చదువుకు దూరం అవుతున్నారు..ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని బస్సు సౌకర్యం కల్పించి గ్రామణ విద్యార్థుల ఉన్నత చదువుకు సహకరించాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదంత్రులు కోరూతున్నారు. ఈకార్యక్రమంలో మాదసి కురువ సంఘం ఆలూరు తాలూకా ప్రధానకార్యదర్శి మల్లయ్య, మాలమహనాడు జిల్లా కార్యదర్శి వీరభద్ర పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు తెగిపడి ఒకరు మృతి

చిత్తూరు,జూలై24(పీపుల్స్ మోటివేషన్): చిత్తూరు జిల్లా పులిచర్ల మండలం గొట్టిగంటివారిప్లలె సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఐదుగురి పరిస్థితి విషమంగా మారింది. ఒంగోలుకు చెందిన ఏవీఆర్ సంస్థలో బిహార్, ఒడిశా కు చెందిన నిర్మాణ రంగ కూలీలు పనిచేస్తున్నారు.వీరంతా గొట్టిగంటివారి ప్లలె వద్ద వాటర్ ట్యాంక్ నిర్మాణానికి వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ తీగలు తెగిపడి ఒకరు మృతి చెందగా 13 మందికి గాయాలు అయ్యాయి. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను పోలీసులు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation

# సీఎం చంద్రబాబు పట్టుదల, కేంద్రం ప్రోత్సాహంతో రాష్ట్రం అభివృద్ధి

**రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్**
**చంద్రబాబు నాయుడు కృషి వల్లే కేంద్ర బడ్జెట్‌లో వరాలు జల్లు**



**అమరావతి, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచనా విధానంతో రాష్ట్రాన్ని పారిశ్రామికాభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వరాల జల్లు కురిపించడం సానుకూల పరిణామమని చెప్పారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్ర అభివృద్ధి కోసం మరిన్ని ప్రాజెక్టులు, సంస్కరణలు అమలు చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రానికి నిధులు కేటాయించడం సంతోషించదగ్గ విషయమని మంత్రి టి.జి భరత్ అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ బలపడిన ప్రభావమే బడ్జెట్‌లో రాష్ట్రానికి అవసరమైన వనరులు పొందడంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు వీలుగా విశాఖపట్నం- చెన్నై పారిశ్రామిక కారిడార్లోని కొప్పర్తి, హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్లోని ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో నీరు, విద్యుత్తు, రైల్వే, రహదారి కల్పనలాంటి మౌలిక వసతులకు నిధులు అందించేందుకు బడ్జెట్‌లో హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులాంటి విజనరీ లీడర్ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని మంత్రి టి.జి భరత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# వేతన జీవులను నిరాశపరచిన కేంద్ర బడ్జెట్ - యుటిఎఫ్







**ప్యాపిలి, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పు చేయకుండా కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేయడం వల్ల వేతన జీవులకు ఎలాంటి ఊరట కలగలేదని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి,సీనియర్ నాయకులు అబ్దుల్ లతీఫ్ విమర్శించారు. యుటిఎఫ్ ప్యాపిలి మండల శాఖ అధ్యక్షులు కృష్ణా నాయక్ అధ్యక్షతన స్థానిక యుటీఎఫ్ కార్యాలయంలో ఈరోజు జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సిపియస్ విధానంలో మార్పులు తెస్తామని చెప్తూనే పాత పెన్షన్ విధానంపై పల్లెత్తుమాట బడ్జెట్ లో లేకపోవడంతో ఉద్యోగ,ఉపాధ్యాయులకు నిరాశ కలిగించిందన్నారు. ఉద్యోగుల ఇన్ కం ట్యాక్స్ సంబంధించి పాత విధానం కంటే కొత్త విధానంలో పన్ను ఎక్కువగా చెల్లించాల్సి రావడంతో ఉద్యోగులు పాత విధానానికే మొగ్గు చూపుతున్నారని ఈసారి అయినా పాత విధానంలో చెల్లించే వారికి రాయితీ ఇస్తారని అందరూ ఆశించారని కాని వారికి నిరాశే మిగిలిస్తూ మరోసారి కొత్త పన్నుల విధానానికే రాయితీలు ప్రకటించడం ఉద్యోగులకు తీవ్ర ఆగ్రహావేశాలకు గురిచేసే విధంగా ఉందని ఆరోపించారు. విద్యారంగానికి బడ్జెట్ లో 6 శాతం కేటాయించవలసి ఉండగా ప్రస్తుత బడ్జెట్ లో 3.25 శాతం నిధులను మాత్రమే కేటాయించి ప్రభుత్వ విద్యారంగానికి ప్రాధాన్యత లేదన్నట్లు ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. వచ్చే ఐదు సంవత్సరాలలో నాలుగు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం గడిచిన 10 సంవత్సరాలలో ఎన్ని ఉద్యోగాలు సృష్టించిందో కనీస ప్రస్తావన కూడా చేయలేదన్నారు.ఇప్పటికైనా మధ్య తరగతి ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రభుత్వం తక్షణమే పాత పెన్షన్ పునరుద్ధరించే దానిపై ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని పాత పన్నుల విధానంలో ఏడు లక్షల వరకు ఎలాంటి పన్ను లేకుండా మినహాయింపు ఇచ్చే విధంగా పన్నుల స్లాబ్ విధానాన్ని సవరించాలని కనీసం లక్ష రుపాయలు స్టాండర్డ్ డిడక్షన్ గా మినహాయింపులు ఉండాలని కోరారు. ఈ సమావేశంలో మండల శాఖ సహాధ్యక్షులు రమేష్ నాయుడు,ఆర్థిక కార్యదర్శి మధు,జిల్లా కౌన్సిలర్లు సర్వజ్ఞ మూర్తి,అంజనప్ప,రాజేంద్ర,మాదన్న తదితరులు పాల్గొన్నారు.

# పంట సాగు పత్రాలతో కౌలు రైతులకు ఎంతో మేలు





**మండల వ్యవసాయ అధికారి ఏ .వెంకటరాముడు**

**పత్తికొండ ,పీపుల్స్ మోటివేషన్ జూలై 24**

పంట సాగు చేస్తున్న రైతులు కౌలు కార్డుని పొందడం వలన బహుళ ప్రయోజనాలు పొందవచ్చును ఈరోజు పుచ్చకాయలమాడ గ్రామంలో కౌలు కార్డుల గ్రామసభ కార్యక్రమం నిర్వహించడం జరిగినది పంట సాగు పత్రం భూ యజమానికి సాగుదారుడు కి మధ్య ఒప్పంద పత్రమని ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు కౌలు రైతులు నష్టపోకుండా ఈ పత్రాలు ఎంతో మేలు చేస్తాయి. ఈ పత్రానికి 11 నెలల గడువు మాత్రమే విలువ ఉంటుంది ఈ పత్రం పొందిన వారు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పంటల బీమా పంటల నష్టపరిహారం సున్నా వడ్డీ ధాన్యం పండించిన తర్వాత ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు అమ్మడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఈ హక్కు పత్రాలను పత్తికొండ మండలం అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో 700 కార్డులను గుర్తించాలని తెలియజేశారు. అందుకుగాను ఈరోజు పుచ్చకాయల మాడలు గ్రామ సభ నిర్వహించడం జరిగింది. అలాగే 23 మంది రైతులకు కౌలు కార్డులని జారీ చేయడం జరిగినది అనంతరం రైతులు సాగుచేసిన పత్తి కంది పంట పొలాలను సందర్శించడం జరిగింది. పంటలు మొదటి దశలో ఉన్నందున రసం పీల్చే పురుగులు ఎక్కువగా ఆశించే అవకాశం ఉన్నందున రైతులు నీమ్ ఆయిల్ లేదా ఎష్ట్రశ్రీశితీశిటఱతీఎజూష్ట్రశీబం శీతీ ంష్ట్రుఱఅఎమ్ఝఇఱఓవఎ 3ఎశ్రీ జూవతీ శ్రీవ్వతీ మరియు %ఉష్ట్రఱశీసవఝతీఎ శీతీ ఝఅషశీఓవఎ వీ45 3 స్త్రతీఝఎం% ఒక లీటర్ నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేసుకోవలెను పత్తి పంటలో జిగురు అట్టలను ఎకరాకి 30 చొప్పున పెట్టుకోవడం వలన ఈ తెల్ల దోమని రసం పీల్చే పురుగులను అరికట్టుకోవచ్చు అలాగే ఇంకా ఎవరైనా విత్తనం వేయని వారు ఈ నెలాఖరి వరకు విత్తుకొనుటకు సరైన సమయం ఆగస్టు మొదటి వారం నుంచి విత్తనం వితటం వలన సరైన దిగుబడులు రావు కావున రైతులు దీనిని గమనించగలరు ఈ కార్యక్రమంలో ఏ వెంకటరాముడు మండల వ్యవసాయ అధికారి పత్తికొండ వారు మరియు గ్రామ రైతులు ఎంపీటీసీ వారు వీఆర్వో కృష్ణ వివిఎ ప్రవలిక శ్రీనాథు పాల్గొనడం జరిగింది.

# కొవిడ్ నుంచి కోలుకున్న బైడెన్..

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కరోనా నుంచి కోలుకున్నారు. కొవిడ్ నెగెటివ్ రావడంతో మంగళవారం శ్వేతసౌధానికి చేరుకున్నారు. బైడెన్ ఆరోగ్యంగా ఉన్నట్లు ఆయన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ కెవిన్ వెల్లడించారు. బైనాక్స్ ర్యాపిడ్ యాంటిజెన్ పరీక్షలో ఆయనకు నెగెటివ్‌గా వచ్చినట్లు ధ్రువీకరించారు. ప్రస్తుతం ఎలాంటి లక్షణాలు కూడా లేవని తెలిపారు. ఆయన ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తామని పేర్కొన్నారు. గత బుధవారం కొవిడ్ సోకినట్లు తేలిన తర్వాత బైడెన్ డెలావెర్‌లోని ఆయన నివాసంలో ఐసోలేషన్‌లోకి వెళ్లిన విషయం తెలిసిందే. క్వారంటైన్‌లో ఉండగానే బైడెన్ కీలక ప్రకటన చేసిన సంగతి విధితమే. అధ్యక్ష రేసు నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మద్దతు తెలిపారు. శ్వేతసౌధం చేరుకున్న సందర్భంగా ఎలా ఉన్నారని విలేకరులు అడిగిన ప్రశ్నకు బైడెన్.. 'అంతా సవ్యంగానే ఉంది' అని బదులిచ్చారు. అధ్యక్ష రేసు నుంచి ఎందుకు వైదొలగాల్సి వచ్చింది? రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్‌ను ఓడించే సామర్థ్యం హారిస్‌కు ఉందా? అని అడిగిన ప్రశ్నలకు మాత్రం ఆయన బదులివ్వలేదు.

# ఏబీవీపీ నందికొట్కూరు నూతన నగర కమిటీ



**నందికొట్కూరు, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

బుధువారం నందికొట్కూరులోని విజ్ఞాన్ కాలేజీ లో ఎబివిపి నగర కమిటీ నీ వేయడం జరిగింది. నగర కార్యదర్శిగా రేవంత్ నగర సహాయ కార్యదర్శులుగా ఈశ్వర్, లక్ష్మీనారాయణ వివిధ ఆయామాల కన్వీనర్లను ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గేటు ఎర్రి స్వామి మాట్లాడుతూ ఎబివిపి ముందుగా వ్యక్తిని నిర్మాణం చేస్తుందిని.ఎబివిపి విద్యార్థి సమస్యలపై పోరాడుతూ ఎన్నో కార్యక్రమాలు చేస్తుందన్నారు అలాగే నగర కమిటీ వాలు అనునిత్యం విద్యార్థి సమాజంలో ఉండి వారి సమస్యలు తెలుసుకొని సమస్యలు పరిష్కరించాలి అని వారు మాట్లాడారు ఈ కార్యక్రమం లో నందికొట్కూరు భాగ్ కన్వీనర్ యుగంధర్, తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# బడ్జెట్ కేటాయింపు హర్షణీయం

**టిడిపి సీనియర్ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున**

**దేవనకొండ, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**



ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలని రాష్ట్రానికి బడ్జెట్లో ఎక్కువ శాతం నిధులు కేటాయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి దేవనకొండ మండల టీడీపీ సీనియర్ నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేసి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని మండిపడ్డారు. బడ్జెట్తో రాష్ట్రానికి అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రానికి వరాల జల్లు కేంద్ర ప్రభుత్వం కురిపించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్ డి ఏ కూటమితో పొత్తు పెట్టుకోవడంతో ఆంధ్ర ప్రదేశ్ కు ఆశించిన ఫలితాలు వస్తున్నాయన్నారు.

# ఆలూరు పోలీసుస్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన... కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపియస్



**ఆలూరు, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

ఆలూరు పోలీసుస్టేషన్ ను జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిసెప్షన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్లవేళలా ఫిర్యాదులు స్వీకరించడం, బాధితుల ఫిర్యాదుల పై సత్వరం స్పందించి సేవలు అందించాలని తెలిపారు. సీసీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్య పర్చాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సిఐ నాగరాజ్ యాదవ్, ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, ఆలూరు ఎస్సై ఓబులేశు ఉన్నారు.



తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
గురువారం | జులై | 25 | 2024
జనరల్ న్యూస్
05

# మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందజేయాలి






**నాగలాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

**గ్రామంలో శానిటేషన్, తాగునీటి సరఫరా గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్**

**కర్నూలు, జూలై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందజేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని మండలం నాగలాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కలెక్టర్ మధ్యాహ్న భోజన పథకం అమలను పరిశీలించారు..అనంతరం విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ రుచి చూశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మధ్యాహ్న భోజనం కోసం వండిన పదార్థాలను పరిశీలించారు.. తప్పనిసరిగా మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు..పాఠశాల ఆవరణంలో ఉన్న వంటశాలను పరిశీలించారు. కట్టెల పొయ్యి మీద వంటలు చేయడాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే గ్యాస్ స్టౌవ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ భోజనం చేసారు..అన్నం చాలా మెత్తగా ఉడికించారని తెలిపారు.. విద్యార్థులకు మంచిగా, నాణ్యతతో కూడిన భోజనాన్ని అందజేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని కలెక్టర్ ఆదేశించారు..తదుపరి కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు.. ఈ విద్యా సంవత్సరంలో పుస్తకాలు, బ్యాగ్స్, షూస్, సాక్స్, యూనిఫాం అందజేశారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాగలాపురం గ్రామంలో శానిటేషన్, తాగునీటి సరఫరా గురించి గ్రామస్థులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు..డి.రామాంజనేయులు అనే వ్యక్తితో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్రాగు నీరు ఎన్ని రోజులకు ఒకసారి వస్తున్నాయి, పారిశుధ్య కార్యక్రమాలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే త్రాగు నీటి కుళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న వారి వద్దకు జిల్లా కలెక్టర్ వెళ్లి రోజుకు ఎన్ని గంటల వరకు నీళ్ళు వస్తున్నాయి, నీళ్లు బాగున్నాయా అని అడిగి తెలుసుకొన్నారు.. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా కుళాయి నీటిని పట్టుకొని త్రాగి, నీళ్లు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఆదోని తహశీల్దార్ హసీనా సుల్తానా, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డిఈఓ సామ్యూల్, డిపిఓ నాగరాజు నాయుడు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బెల్టు షాపులను ఎత్తివేస్తామని హామీ ఎక్కడికి పోయింది ?





**తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి**

**సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వస్తే బెల్టు షాపులను ఎత్తివేస్తామని హామీ**

**రేవంత్ రెడ్డి ప్రభుత్వం మద్యం అమ్మకాల ద్వారా ఆదాయాన్ని పెంచే ఆలోచన**

**మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలకు రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలి**

**బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.మేకల శిల్పారెడ్డి**

**వనపర్తి, జూలై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

వనపర్తి జిల్లా కేంద్రంలో బుధవారం మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రంలోని ఎన్విఆర్ బ్యాంకెట్ హాల్ లో జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.మేకల శిల్పా రెడ్డిని జిల్లా ఉపాధ్యక్షులు ఏ.సీతారాములు వారి కుటుంబ సభ్యులు ఏ.కావ్య మరియు ఏ.భవ్య గజమాలతో సత్కరించారు.ముఖ్య అతిథి డా. మేకల శిల్పారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు హోం శాఖను నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునే వ్యవహారాల్లో తలామునకులై ఉన్నాడని మహిళలపై ఏ చిన్న అగాయిత్యం జరిగిన మహిళా మోర్చా ముందుండి పోరాటం సాగించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారంలోకి వస్తే బెల్టు షాపులను ఎత్తివేస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం మద్యం అమ్మకాల ద్వారా ఆదాయాన్ని పెంచూకునే దిశగా ఆలోచిస్తుంది కానీ బెల్ట్ షాపులను ఎత్తివేసే ఆలోచన చేయడం లేదని ప్రభుత్వం బెల్ట్ షాపులను ఎత్తివేసే వరకు మహిళా మోర్చా ముందుండి పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు.ఆగస్టు నుంచి జాతీయ పార్టీ ఆదేశం మేరకు ప్రతి నాయకురాలు కూడా పోలింగ్ బూత్ లో అత్యధిక సంఖ్యలో మహిళల సభ్యత్వం చేయించాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీ మహిళల కోసం ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ అభియాన్ బేటి బచావో బేటి పడావో గర్భిణీలకు పౌష్టికాహార సరఫరా ద్వారా మాతృత్వ మరణాల తగ్గుదల మహిళా ఉద్యోగులకు 24 వారాల ప్రసూతి సెలవులు డ్రోన్ దీదీ యోజన చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తదితర సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లి బిజెపి గెలిచేలా కార్యాచరణ తయారు చేసుకోవాలని పేర్కొన్నారు.

మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగే విధంగా ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం అనవసర విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని గతంలో తెలంగాణకు ఎన్ని నిధులు నరేంద్ర మోడీ మంజూరు చేశారో కాంగ్రెస్ వారు ఆలోచించుకోవాలని కేంద్ర ప్రభుత్వం సహకారం లేకపోతే ఏ రాష్ట్రం కూడా అభివృద్ధి చెందలేదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి మహిళా మోర్చా రాష్ట్ర సహకోశాధికారి ఎన్.జ్యోతి రమణ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.అలివేలు మాజీ జిల్లా అధ్యక్షురాలు వారణాసి కల్పన మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు సూగూరు లక్ష్మి అరుణ కవిత పద్మమ్మ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఏ సీతారాములు బండారు కుమారస్వామి పట్టణాధ్యక్షులు బచ్చు రాము ప్రధాన కార్యదర్శులు రాయన్న సాగర్ సూగురు రాము పి ఎమ్ రాము విజయ్ రాఘవేందర్ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## బలిశ్వరమ్మ మృతి దేహానికి పూలమాలవేసి నివాళ్ళు అర్పించిన జిల్లా అధ్యక్షుడు




**శ్రీరంగాపూర్ /వనపర్తి, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

శ్రీరంగాపూర్ మండల పరిధిలోని జానంపేట గ్రామంలో కథలయ్య భార్య బాలిశ్వరమ్మ అనారోగ్యంతో మరణించిన వార్త తెలిసిన వెంటనే వారి నివాసానికి చేరుకున్నా వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఎం. రాజేంద్రప్రసాద్ యాదవ్ వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి.రాములు యాదవ్ , కంబలాపూర్ మాజీ ఎంపిటిసి ఎల్ల స్వామి, శ్రీరంగాపూర్ ఎస్సీ సెల్ శీను, తదితరులు పాల్గొన్నారు.

## లెవెన్ కె.వి లైన్ తీసివేత ఎస్ ఈ కి లెటర్ అందజేసిన జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్




**శ్రీరంగాపూర్/ వనపర్తి, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

శ్రీరంగాపూర్ మండలం తాటిపాముల గ్రామంలో 11కెవి లైన్ తీసివేత గురించి అలాగే సబ్ స్టేషన్ నూతనంగా ఎర్పాటు చేయుట గురించి ఎస్ఈ తో వనపర్తి జిల్లా అధ్యక్షుడు ఎం రాజేంద్రప్రసాద్ యాదవ్ శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బి.రాములు యాదవ్ ఇద్దరు కలిసి తాటిపాముల గ్రామంలో ఉన్నటువంటి కరెంట్ సమస్యల పైన చర్చించి లెటర్ ఇవ్వడం జరిగింది.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



**శ్రీరంగాపూర్ /వనపర్తి ,జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

శ్రీరంగాపూర్ మండల పరిధిలోని టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా టిఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్లలో పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జలీల్, ఉద్యమ నాయకులు పర్వతాలు, డాక్టర్ కురుమన్న, చంద్రయ్య,సూరయ్య, రామకృష్ణ ,వెంకటేష్, ఆంజనేయులు , బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక

పీపుల్స్ మోటివేషన్

People's Motivation

# ఉగ్రవాద సంస్థను నడిపినట్లు దోషిగా తేలిన అంజెమ్ చౌదరికి జీవిత ఖైదు..

బ్రిటన్, పాకిస్థాన్‌ల ద్వంద్వ పౌరసత్వం కలిగిన రాడికల్ ఇస్లామిక్ బోధకుడు అంజెమ్ చౌదరికి జీవిత ఖైదు విధించారు. నిషేధిత ఉగ్రవాద సంస్థను నడిపినందుకు మంగళవారం దోషిగా తేలింది. దీంతో.. అంతర్జాతీయ స్థాయిలో సంయుక్త విచారణ అనంతరం చౌదరికి యూకేలో జీవిత ఖైదు విధించారు. చౌదరి వయస్సు 57 సంవత్సరాలు. ఉగ్రవాద సంస్థ అల్-ముహాజిరౌన్‌లో కేర్‌టేకర్ పాత్ర పోషిస్తున్నట్లు గుర్తించారు. లండన్‌లోని వూల్‌విచ్ క్రౌన్ కోర్టులో విచారణ సందర్భంగా.. 2014 నుండి నిర్దిష్ట కాలానికి మద్దతుగా ఒక తీవ్రవాద సమూహాన్ని నడుపుతున్నట్లు.. ఆన్‌లైన్ సమావేశాలను నిర్వహించినట్లు చౌదరి నేరాన్ని అంగీకరించాడు. అంతకుముందు.. మెట్రోపాలిటన్ పోలీస్, న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్.. రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు అంజెమ్ చౌదరిని విచారించారు. అనంతరం.. కోర్టులో ప్రవేశపెట్టగా, జూలై 30న తన తీర్పును వెలువరించింది. ఈ కేసులో చౌదరికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఏఎల్ఎం నెట్‌వర్క్ ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోందని మెట్రోపాలిటన్ పోలీస్ యాంటీ టెర్రరిజం విభాగం అధిపతి కమాండర్ డొమినిక్ మర్ఫీ తెలిపారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రజల భద్రత.. భద్రతపై ప్రభావం చూపుతోందన్నారు. 2006లో అల్ ఘురాబా పేరుతో ఏఎల్ఎం మొదటిసారిగా యూకేలో నిషేధించబడినట్లు నివేదించారు. అందులో కీలకమైన ముగ్గురు సభ్యులలో చౌదరి ఒకరు. చౌదరి 2023 వరకు ఏఎల్ఎం నాయకుడిగా పనిచేశాడు. ఇస్లామిక్ థింకర్స్ సొసైటీకి ఆన్‌లైన్ ప్రసంగాలు చేయడం ద్వారా ఏఎల్ఎంకి మద్దతు ఇచ్చారని దర్యాప్తు సంస్థ క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ తెలిపింది. 2018లో ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థకు మద్దతుగా నిలిచినందుకు చౌదరికి ఐదేళ్ల శిక్ష పడింది. కానీ అతను ముందుగానే విడుదలయ్యాడు.. 2021 వరకు అతనికి ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. ఈ నిషేధం ముగిసిన వెంటనే.. చౌదరి మళ్లీ ఇల్ఫోర్డ్‌లోని తన ఇంటి నుండి వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా ఇస్లామిక్ సంస్థకు మద్దతు ఇవ్వడం ప్రారంభించాడు. గతేడాది జూలైలో చౌదరి సహచరుడు ఖలీద్ హుస్సేన్ (29)ను లండన్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. అతను ఏఎల్ఎం సభ్యునిగా దోషిగా తేలింది. 2022 జూన్ నుండి అరెస్టు అయ్యే వరకు.. చౌదరి బ్రిటన్‌లో ఇస్లామిక్ స్టేట్ స్థాపనపై చిన్న చిన్న సమూహాలలో ఆన్‌లైన్ ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా నొక్కిచెప్పారని దర్యాప్తు సంస్థ కోర్టుకు తెలిపింది.



## ఉత్తమ 108 టెక్నీషియన్ అవార్డు అందుకున్న శశి కుమార్



**శ్రీరంగాపూర్/ వనపర్తి, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**

శ్రీరంగాపూర్ మండలం తాటిపాముల గ్రామానికి చెందిన %ు%. శశి కుమార్ జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో 108 టెక్నీషియన్ గా గత 10సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్నారు. శశి కుమార్ విధి నిర్వహణలో చాలా చురుకుగా ఉంటూ అత్యవసర సమయంలో గర్భిణీలను అంబులెన్స్ లో తరలించే సమయంలో అంబులెన్స్ లో ఎన్నో నార్మల్ డెలివరీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్ లోని 108 ఆఫీసులో సీఈఓ ఖలీద్, ప్రోగ్రాం మేనేజర్ మహబూబ్ చేతుల మీదుగా వనపర్తి జిల్లా నుంచి ఉత్తమ టెక్నీషియన్ గా అవార్డు అందుకున్నారు. వీరితోపాటు గోపాల్పేట మండల కేంద్రానికి చెందిన మహేష్ ఉత్తమ పైలట్ గా అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకోవడం పట్ల 108 సిబ్బంది, గ్రామస్తులు ఇరువురికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఈఎంఈ రత్నం, ఉదయ్ పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపిన కేంద్ర ప్రభుత్వం

**ఎం. రాజేంద్ర ప్రసాద్ యాదవ్ వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు**

**శ్రీరంగాపూర్ /వనపర్తి, జులై 24 (పీపుల్స్ మోటివేషన్):-**



తెలంగాణ కు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు ఎం. రాజేంద్రప్రసాద్ యాదవ్ విలేకరుల ప్రకటన ద్వారా తెలుపుతూ తెలంగాణకు ప్రత్యేక నిధులు కేటాయింపు లేమీ జరగలేదు అని ఆయన అన్నారు ప్రజల సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి ఎన్ని సార్లు కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిశారు. ఈ రోజు కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి" నిధులు కేటాయించండంలో ఇంత వివక్ష చూపుతుందను కోలేదు. దేశానికి పెద్దన్నగా వ్యవహరించి తెలంగాణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు దేశ ప్రధానిని,కేంద్ర మంత్రులను కలిసి కోరిన పట్టించుకోక పోవడం బాధకరం తెలంగాణలో ఐటీ రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తూ ఐటీఐఆర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని కోరినా కేటాయింపు చేయలేదు. వెనుకబడిన ఈ ప్రాంత అభివృద్ధికి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణానికి జాతీయ హోదా కింద నిధులు ఇవ్వలేదు. కృష్ణ%-%వికారాబాద్ రైల్వే లైన్ ఏర్పాటుపై బడ్జెట్ లో నిధులు కేటాయింపులు చేయకపోవడం దారుణం. రెండు రాష్ట్రాలు ఒకే సారి ఏర్పాటు జరిగిన ఆంధ్రకు నిధుల వరద పారించి, తెలంగాణకు మొండి చేయి చూపించడం సరికాదు. 17ఎంపిలకు గాను 8మంది బీజేపీ ఎంపీలను తెలంగాణ ప్రజలు గెలిపిస్తే, తెలంగాణకు నిధులు తీసుకోని రాలేకపోయినా 8మంది బీజేపీ అసమర్థత ఎంపీలు ,ఆ పార్టీ నాయకులు,తెలంగాణ లో ఏమొఖం పెట్టుకొని తిరుగుతారో వారే చెప్పాలి. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం జరగడంతో బీజేపీకి ఓటు వేసి తప్పు చేశామనే భావన ప్రజల్లో కనిపిస్తుంది అని రాజేంద్ర ప్రసాద్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.


## నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించిన

**ఇండియా బ్లాక్ ఎంపీలు**



కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాలపై వివక్ష చూపించారని పార్లమెంట్‌లో, వెలుపల నిరసన తెలియజేయాలని ఇండియా బ్లాక్ పార్టీలు మంగళవారం నిర్ణయించాయి. మంగళవారం రాత్రి 10 గంటలకు రాజాజీ మార్గ్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే నివాసంలో జరిగిన ఇండియా బ్లాక్ పార్టీల ఫ్లోర్ లీడర్‌ల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభలో కాంగ్రెస్ ఉపనేత ప్రమోద్ తివారీ, లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్, ఎన్సీపీ (ఎస్‌సీపీ) అధినేత శరద్ పవార్, శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ , ఈ సమావేశంలో టిఎంసి నాయకులు డెరెక్ ఓబ్రెయిన్, కళ్యాణ్ బెనర్జీ, డిఎంకె టిఆర్ బాలు, జెఎంఎం మహువా మాజీ, ఆప్ నుండి రాఘవ్ చద్దా, సంజయ్ సింగ్, సిపిఐ(ఎం) జాన్ బ్రిట్టాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కెసి వేణుగోపాల్, జైరాం రమేష్ కూడా పాల్గొన్నారు. సమావేశం అనంతరం వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ.. "ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ ఇప్పటికే బడ్జెట్ భావనను నాశనం చేసింది. చాలా రాష్ట్రాలపై పూర్తిగా వివక్ష చూపింది, కాబట్టి దీన్ని వ్యతిరేకించాల్సిందేనని ఇండియా బ్లాక్ మీటింగ్ భావిస్తోంది. ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ చాలా వివక్షత, ప్రమాదకరమైనది. ఇది కేంద్ర ప్రభుత్వం అనుసరించాల్సిన ఫెడరలిజం, ఫెయిర్‌నెస్ సూత్రాలకు పూర్తిగా విరుద్ధం" అని అన్నారు. దీనికి నిరసనగా జూలై 27న జరగనున్న నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించారు.

## ఇథియోపియాలో భారీవర్షాలకు146మంది దుర్మరణం



ఇథియోపియా: దక్షిణ ఇథియోపియాలోని మారుమూల ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు మరణించినవారి సంఖ్య 146కు చేరింది. దక్షిణ ఇథియోపియాలోని కెంచో షాచా గోజ్డి జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో మరణించినవారిలో... చిన్నారులు, గర్భిణీలు ఉన్నారని స్థానిక అధికారులు తెలిపారు. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనలో 55మంది మరణించగా మంగళవారం నాటికి మృతుల సంఖ్య 146కి పెరిగిందని అక్కడి అధికారులు మీడియాకు వెల్లడించారు. మట్టిదిబ్బల్లో కూరుకుపోయిన బాధితులను రక్షించేందుకు రెస్క్యూ సిబ్బంది చర్యలు వేగవంతం చేశారని, బురదలో చిక్కుకుపోయిన ఐదుగురిని ప్రాణాలతో రెస్క్యూటీమ్ రక్షించగలిగారని ఆయన తెలిపారు. సంఘటన ప్రాంతంలో ప్రమాదంలో తన తల్లిదండ్రులతోపాటు మొత్తం కుటుంబాన్ని కోల్పోయిన చిన్నారులు డెడ్?బాడీలను కౌగిలించుకుని విలపిస్తున్నట్లు చెప్పారు. కాగా, ఇథియోపియాలో వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటం సర్వ సాధారణం. జులైలో ప్రారంభమయ్యే వర్షాలు సెప్టెంబర్? మధ్య వరకు కురుస్తాయని ఈ కాలంలో కొండచరియలు విరిగిపడి సమీప ప్రాంతాల్లో నివసించే వ్యక్తులు ప్రాణాలు కోల్పోతున్నట్లు స్థానికులు తెలిపారు.

## అమెరికా సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ రాజీనామా..

యూఎస్ సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ కింబెర్లీ తన మంగళవారం (జూలై23, 2024) పదవికి రాజీనామా చేశారు. ఇటీవల అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష పోటీలో ఉన్న డొనాల్డ్ ట్రంప్ పై దాడికి బాధ్యత వహిస్తూ కింబెర్లీ రాజీనామా చేశారు. జూలై 13 న పెన్సిల్వేనియాలో ట్రంప్ ప్రచార ర్యాలీ పాల్గొనగా 22 యేళ్ల షూటర్ కాల్పుడు జరిపాడు. ఈ ఘటనలో ట్రంప్ ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నారు. చెవికి స్వల్ప గాయాలయ్యాయి..ట్రంప్ పై దాడితో అమెరికాలో భద్రతపై ఆందోళనలు వెల్లువెత్తాయి. బట్లర్ టౌన్ షిప్ లో జరిగిన ర్యాలీలో డొనాల్డ్ ట్రంప్ పై హత్యాయత్నానికి సంబంధించిన విచారణ సందర్భంగా సోమవారం కింబర్లీ చీటిల్ ను హౌజ్ కమిటీ సభ్యులు మందలించారు. డొనాల్డ్ ట్రంప్ చివరి క్షణంలో తల కదపడంతో తూటా అతని చెవిలోంచి వెళ్లడంతో తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. ట్రంప్ తల కదిలించకపోతే బుల్లెట్ తలలోకి దూసుకెళ్లి మరణానికి దారి తీసే అవకాశం ఉంది. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ పై మూడు రౌండ్ల కాల్పులు జరిగిపిన వ్యక్తిని స్నిపర్లు అక్కడికక్కడే కాల్చి చంపారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం జోరందుకుంది. డొనాల్డ్ ట్రంప్ ర్యాలీలను పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తున్నారు. ఎన్నికలకు కొన్ని నెలల ముందు.. అటువంటి క్లిష్ట సమయంలో సీక్రెట్ సర్వీస్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేయడం ఆందోళనకరం.. ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ పై ఇప్పటికే దాడి జరిగింది. అధ్యక్ష అభ్యర్థిపై మరో దాడికి ప్రయత్నించవచ్చనే ఆందోళనలు అమెరికా ప్రజల్లో కనిపిస్తున్నాయి.

## ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం..

దేశ రాజధాని ఢిల్లీలోని నరేలా ప్రాంతంలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీ మొత్తం కాలిపోతోంది. ఘటనా స్థలానికి 25 అగ్నిమాపక వాహనాలను పంపించారు. సమాచారం మేరకు ఉదయం 6.30 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదంపై పోలీసులకు సమాచారం అందింది. ఈ ఫ్యాక్టరీ నరేలా ఇండస్ట్రియల్ ఏరియాలో ఉంది. ఎటువంటి గాయాలు లేదా ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. వార్త రాసే వరకు మంటలను అదుపు చేయలేకపోయారు. ఢిల్లీ ఫైర్ సర్వీస్‌కు చెందిన 25 ఫైర్ టెండర్లను సంఘటనా స్థలానికి పంపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో కూడా బయటకు వచ్చింది. ఫ్యాక్టరీ నుంచి నల్లటి పొగ వెలువడుతోంది. ఆకాశంలో మంటలు కనిపిస్తున్నాయి. ఫ్యాక్టరీ పైన ఉన్న ఆకాశమంతా నల్లగా మారిపోయింది. అగ్నిమాపక యంత్రాలు మంటలను ఆర్పే పనిలో నిమగ్నమై ఉన్నాయి. పరిసర ప్రాంతాలను ఖాళీ చేయించారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై ఇంకా ఎలాంటి సమాచారం వెల్లడి కాలేదు. ఎలాంటి గాయాలు, ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు.

## టీడీఆర్ బాండ్లలో భారీ కుంభకోసం

**తణుకులోనే 700 కోట్ల అవినీతి**

**రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ**

**అమరావతి,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

టీడీఆర్ బాండ్లకు సంబంధించి ఒక్క తణుకులోనే రూ.700 కోట్ల మేర అవినీతి జరిగిందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. రాష్ట్రంలో తణుకు, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరులో టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగిందన్నారు. 'టౌన్ ప్లానింగ్ విషయంలో 2014-19 మధ్య కాలంలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. కానీ, గత ప్రభుత్వ హయాంలో టీడీఆర్ బాండ్ల విషయంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగింది. తణుకులో 29 బాండ్లు ఇచ్చారు.. వీటిలో అన్నీ అవకతవకలే జరిగాయి. గజాల కింద లెక్కలు వేయాల్సి ఉండగా.. ఎకరాల చొప్పున లెక్కలేసి బాండ్లలో అవకతవకలకు పాల్పడ్డారు. 1:200 నిష్పత్తిలో ఇవ్వాల్సింది 1:400 నిష్పత్తిలో ఇచ్చారు. విలువలూ పెంచేశారు. ఇదో పెద్ద కుంభకోణం .. దీని వల్ల ముగ్గురు సస్పెండ్ అయ్యారు. టీడీఆర్ బాండ్ల విషయంలో అవినీతి ఇలా కూడా చేస్తారా? అని ఆశ్చర్యం కలిగే రీతిలో స్కామ్ జరిగింది. రూ.వందల కోట్ల అవినీతి జరిగింది. గుంటూరులోనూ ఇదే తరహాలో వాల్యుయేషన్‌లో తేడాలు చూపించారు. 9 వేల గజాలు అయితే 20 వేల గజాలకు లెక్కలేసి టీడీఆర్ బాండ్లలో చూపించారు. ఈ స్కామ్ విషయంలో సీఎం చంద్రబాబుతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పనులూ చేయొద్దని అధికారులకు స్పష్టంగా చెప్పాం. ఏ స్థాయి నాయకుడైనా సరే నిబంధనలకు విరుద్ధంగా చేయమంటే.. చేయొద్దని సూచించాం' అని మంత్రి నారాయణ వెల్లడించారు.

## రెవెన్యూ రికార్డుల దగ్ధం కేసు

**పలువురు అధికారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**కొనసాగుతున్న అధికారుల విచారణ**

**మదనపల్లె,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ దస్త్రాల దహనం చేసిన ఘటనలో విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. గత మూడు రోజులుగా రెవెన్యూ, పోలీసు, సీఐడీ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసులో కుట్రధారులుగా అనుమాని స్తున్న పలువురు రెవెన్యూ అధికారులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మదనపల్లె ఆర్డీవోగా పనిచేసిన మురళి, ప్రస్తుత ఆర్డీవో హరిప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌ను పోలీసులు.. సబ్ కలెక్టర్ కార్యాలయంలోనే వరుసగా మూడోరోజు కూడా విచారణ చేస్తున్నారు. బుధవారం ఉదయం అగ్నిమాపకశాఖ డైరెక్టర్ వెంకటరమణ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగితే.. ఎవరు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు, సిబ్బంది వచ్చినప్పుడు కార్యాలయంలో ఎవరెవరు ఉన్నారనే దానిపై ఆరా తీశారు. ఈ ఘటనకు ప్రాథమిక విచారణలో బాధ్యులుగా చేరిన ముగ్గురు పోలీసులపై ఉన్నతాధికారులు వేటు వేశారు. మదనపల్లె వన్‌టౌన్ సీఐ ఒలిబస్‌ను వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలిచ్చారు. అగ్ని ప్రమాదం జరిగితే ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం ఇవ్వలేదనే ఆరోపణలతో సీఐను వీఆర్‌కు పంపారు. ఆయనతో పాటు నైట్ డ్యూటీలో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లు హరిప్రసాద్, భాస్కర్‌ను సస్పెండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో.. జిల్లా కలెక్టర్, ఎస్పీ, సీఐడీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ ఘటనలో కుట్ర కోణాన్ని వెలికితీయడానికి అధికార బృందం చర్యలు చేపట్టింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధాన అనుచరుడు మాధవరెడ్డి ఈ ఘటనలో కీలక పాత్రధారిగా భావిస్తూ ఆయన కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో భూవివాదాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి సిసోడియా నేతృత్వంలోని అధికారుల బృందం గురువారం సాయంత్రం నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. 2022 నుంచి మదనపల్లె డివిజన్‌లో నెలకొన్న భూ వివాదాలను పరిష్కరించాలని అధికారులు భావిస్తున్నారు. తమ సమస్యలపై ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## సాగునీటి ప్రాజెక్టులపై మండలిలో చర్చ

**హైదరాబాద్,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

తెలంగాణ శాసన మండలిలో సాగునీటి ప్రాజెక్టులపై స్వల్పకాలిక చర్చ జరిగింది. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడారు. 'తుమ్మిడహట్టి వద్దే ప్రాజెక్టు కట్టాలి. అప్పుడే ప్రాణహిత నది నుంచి పుష్కలంగా నీళ్లు అందుతాయి. ప్రాజెక్టుకు బ్జడెట్‌లో రూ.5 వేలకోట్లు కేటాయించాలి' అని కోరారు. గంధమల్ల రిజర్వాయర్ అంశం సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉందని మరో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది పూర్తయితే ఆలేరు ప్రాంతానికి లాభం చేకూరుతుందని.. ఈ బ్జడెట్‌లో నిధులు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation
గురువారం । జులై । 25 । 2024



# విషమించిన లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్యం..

ఆర్జేడీ అధినేత లాలూ యాదవ్ ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించడంతో మంగళవారం (జులై 23) ఆసుపత్రిలో చేరారు. ఆయనను ఢిల్లీ ఎయిమ్స్‌లో చేర్చారు. ప్రత్యేక వైద్యుల బృందం అతడిని పర్యవేక్షిస్తూ చికిత్స అందించింది. ప్రస్తుతం లాలూ యాదవ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆయన డిశ్చార్జ్ అయ్యారని సమాచారం. లాలూ యాదవ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా కనిపించారు. ఆయన సోమవారం నాడు పాట్నా నుంచి ఢిల్లీకి వచ్చారు. ఎయిమ్స్ వైద్యులు ఆయనను ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచారు. ఆస్పత్రిలో చేరిన లాలూ యాదవ్‌కు సంబంధించిన కొన్ని చిత్రాలు కూడా బయటకు వచ్చాయి. అతని చుట్టూ మద్దతుదారుల గుంపు కూడా కనిపిస్తుంది. ఆర్జేడీ నేత ప్రిన్స్ యాదవ్ కూడా లాలూ యాదవ్ ఆరోగ్యానికి సంబంధించి సోషల్ మీడియా ఎక్స్‌లో ఒక పోస్ట్‌ను పంచుకున్నారు. లాలూ యాదవ్ సోమవారం (జూలై 22) ఢిల్లీకి చేరుకున్నారు. అదే రోజు బీహార్ సీఎం నితీష్ కుమార్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని నితీష్ డిమాండ్‌పై లాలూ యాదవ్ కార్నర్ చేశారు. 77 ఏళ్ల మాజీ సీఎం లాలూ యాదవ్ గత కొన్నేళ్లుగా అనేక వ్యాధులకు చికిత్స పొందుతున్నారు. 2022లో సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి చేయించుకున్నాడు. సమాచారం ప్రకారం లాలూకి కిడ్నీ వ్యాధి ఉంది. వైద్యులు అతనికి మార్పిడి చేయాలని సూచించారు.



## ఘోర ప్రమాదం.. నీటిలో మునిగి ఐదుగురు మృతి..




ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో ఘోరం చోటు చేసుకుంది. సంత్ కబీర్ నగర్ జిల్లాలోని బఖిరా, దుధార ప్రాంతాల్లో మంగళవారం చెరువులు, సరస్సుల్లో మునిగి ఐదుగురు బాలికలు మృతి చెందారు. బఖీరా సరస్సులో స్నానానికి వెళ్లిన బద్గావ్ గ్రామానికి చెందిన నలుగురు బాలికల్లో ముగ్గురు మృతి చెందగా, ఒకరు మెహందావాల్ సిహెచ్‌సిలో చేరారు. అదే సమయంలో, దుధార పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖతియావాన్ గ్రామానికి చెందిన ఇద్దరు సోదరీమణులు, వరి నాట్లు వేయడానికి వెళ్లి చెరువులో జారిపడి మునిగి మరణించారు. బఖిరా పోలీస్ స్టేషన్ పరిధిలోని బద్గో గ్రామానికి చెందిన దిలీప్ కుమార్తె పాయల్ (12), మక్సుదాన్ నిషాద్ కుమార్తె మీనాక్షి (15), రామ్‌నేవాస్ కుమార్తె అర్చన (17), రమేష్ కుమార్తె కాజల్ (14) బఖిరాలో స్నానానికి వెళ్లారు. మంగళవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో సరస్సు. లోతైన నీటిలోకి వెళ్లిన తర్వాత నలుగురూ మునిగిపోవడం ప్రారంభించారు. బాలికల అరుపులు విని కొద్ది దూరంలో ఉన్న ఆలయం వద్ద ఉన్న గ్రామస్థులు సరస్సు వైపు పరుగులు తీశారు. గ్రామస్థులు వచ్చే సమయానికి ఓ బాలిక రక్షించాలని వేడుకుంది. నలుగురినీ నీటి నుండి బయటకు తీసి సిహెచ్‌సి మెహదావాల్‌కు తీసుకెళ్లారు, అక్కడ వైద్యులు మీనాక్షి, పాయల్, అర్చన, కాజల్ మరణించినట్లు ప్రకటించారు. రాజేంద్ర యాదవ్ కుమార్తె ప్రమీల (17), ఊర్మిళ (15) అనే ఇద్దరు సోదరీమణులు దుధార పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖతియావాన్‌లోని చెరువు పక్కనే ఉన్న పొలంలో వరి నాట్లు వేయడానికి వెళ్లారు. ప్రమీల, ఊర్మిళ పాదాలు జారి రెయిలింగ్ లేకపోవడంతో ఇద్దరూ చెరువులో పడిపోయారు.

## మమతా బెనర్జీ పై షేక్ హసీనా ప్రభుత్వం

**భారత సర్కార్‌కు ఫిర్యాదు**

బంగ్లాదేశ్‌లో దిగజారుతున్న పరిస్థితులపై మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యపై భారతదేశంలో వివాదం ఆగలేదు..బంగ్లాదేశ్ ప్రభుత్వం కూడా దీనిపై స్పందించింది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యను సీరియస్‌గా తీసుకున్న పొరుగు దేశం న్యూఢిల్లీకి అధికారిక నోట్ పంపింది. బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి హసన్ మహమూద్ తన ప్రకటనలో.. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో మాకు చాలా మంచి, సత్సంబంధాలు ఉన్నాయి. అయితే ఈ ప్రకటనతో గందరగోళానికి ఆస్కారం ఉంది. ఈ విషయంపై మేము భారత ప్రభుత్వానికి ఒక నోట్ పంపాము. ఇటీవల బంగ్లాదేశ్‌లో నిరసనల సందర్భంగా పోలీసుల క్రూరత్వాన్ని చూసిన పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ, బంగ్లాదేశ్ నిస్సహాయ ప్రజలు పశ్చిమ బెంగాల్ తలుపులు తడితే, వారికి ఖచ్చితంగా సహాయం చేస్తానని అన్నారు. ఆయన ప్రకటన తర్వాత భారతదేశంలో కూడా రాజకీయాలు వేడెక్కాయి. బిజెపి ప్రభుత్వ నాయకులు అతని ప్రకటనపై ప్రశ్నలు లేవనెత్తారు. జూలై 21న కోల్‌కతాలో జరిగిన 'అమరవీరుల దినోత్సవం' సందర్భంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "బంగ్లాదేశ్ గురించి నేను పెద్దగా చెప్పను. ఎందుకంటే అది వేరే దేశం. దీనిపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని తెలియజేస్తుంది. కానీ అక్కడి నిస్సహాయులు బెంగాల్ తలుపు తడితే వారికి ఆశ్రయం కల్పిస్తాం. ఐక్యరాజ్యసమితి ప్రతిపాదన కూడా ఉంది. పొరుగువారు శరణార్థులను గౌరవిస్తారు. ఈ ప్రకటన తర్వాత పశ్చిమ బెంగాల్ గవర్నర్ సివి ఆనంద్ బోస్ తన వ్యాఖ్యపై ముఖ్యమంత్రి నుండి సమాధానం కోరారు. విదేశాల నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పించడం కేంద్ర ప్రభుత్వ పని అని, దీనిపై మమతా బెనర్జీ బహిరంగ ప్రకటన చేయడం రాజ్యాంగ ఉల్లంఘన అని గవర్నర్ కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



## భర్త చనిపోవడంతో బతకలేనంటూ ఏడుస్తూ కన్నుమూసిన భార్య

భార్యాభర్తల బంధం అనేది చాలా ప్రత్యేకమైనది. రెండు వేరు వేరు స్వభావాలు కలిగిన మనస్సులు పెళ్లి అనే బంధంతో ఒక్కటవుతాయి. ఇక దంపతుల మధ్య ఉండే ప్రేమానుబంధాలు చాలా ప్రత్యేకం. కష్టాసుఖాల్లో పాలు పంచుకుంటూ సంసారం సాగిస్తుంటారు. ఒకరినిఒకరు చూసుకోకుండా అస్సలు ఉండలేరు. ఏడేడు జన్మలు కలిసి ఉండాలని కోరుకుంటారు. కానీ కొంతమంది మాత్రమే దానిని నిలబెట్టుకోగలుగుతారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో ఓ జంట దీన్ని నిజం చేసింది. భర్త చనిపోయిన మూడు నిమిషాలకే భార్య కూడా ప్రాణత్యాగం చేసింది. వారిద్దరి అంత్యక్రియల ఊరేగింపు ఇంటి నుండి కలిసి బయలుదేరడంతో చూసిన వాళ్లంతా కన్నీటి పర్యంతం అయ్యారు. ఇప్పుడు ఇదే ఈ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. అనారోగ్యంతో బాధపడుతున్న శంకర్ మండల్ (85) సోమవారం మృతి చెందారు. 68 ఏళ్ల భార్య నియతి మండల్ తన భర్త మరణంతో షాక్‌కి గురైంది. ఆమె అతని ఛాతీపై తల పెట్టుకుని ఏడవడం ప్రారంభించింది. మూడు నిమిషాల తర్వాత నియతి కూడా చనిపోయింది. ఇద్దరూ కలిసి 50 ఏళ్లు గడిపారు. సమాచారం మేరకు భరత్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భోల్తా గ్రామంలో నివసిస్తున్న శంకర్ మండల్‌కు 50 ఏళ్ల క్రితం నియతి మండల్‌తో వివాహమైంది. వారికి పిల్లలు, మనువలు కూడా ఉన్నారు. పూర్తి కుటుంబ జీవితాన్ని అనుభవించారు. ఈ జంట కుటుంబంతో చాలా సంతోషంగా గడిపారు. కానీ శంకర్‌కి 85 ఏళ్లు వచ్చేసరికి వయసు రీత్యా అనారోగ్య సమస్యలు వచ్చాయి. కొద్ది రోజుల క్రితం ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. అతడిని చికిత్స నిమిత్తం భరత్‌పూర్ గ్రామీణ ఆసుపత్రిలో చేర్పించారు. కొద్దిరోజుల తర్వాత అక్కడి నుంచి డిశ్చార్జి చేసి ఇంటికి పంపించారు. ఇక్కడికి వచ్చిన వెంటనే ఒకటి రెండు రోజుల తర్వాత సోమవారం ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. కుటుంబీకులు ఆస్పత్రికి తరలించేలోపే శంకర్ మృతి చెందాడు. నియతి మండలం తన భర్త మృతిని తట్టుకోలేకపోయింది. భర్త మృతదేహం దగ్గర కూర్చుంది. ఆమె అతని ఛాతీపై తల ఉంచి ఏడవడం ప్రారంభించింది. ఏడుస్తూనే సైలెంట్ అయిపోయింది నియతి. వెంటనే భర్త మృతదేహం నుంచి ఆమెను వేరు చేసేందుకు కుటుంబీకులు ప్రయత్నించగా, నియతిలో చలనం లేకుండా శరీరం చల్లబడినట్టు గుర్తించారు. ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ చెక్ చేయగా, నియతి కూడా చనిపోయిందని చెప్పారు. భర్త చనిపోయిన 3 నిమిషాలకే నియతి మరణించింది. ఇది చూసిన ఆ కుటుంబంలో మరింత విషాదం నెలకొంది. అనంతరం నియతి మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. భార్యాభర్తలిద్దరి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

## ఆర్టీసిని ఆగం చేసిన చరిత్ర హరీష్‌ది

**గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసిని బొందపెట్టింది**

**ప్రశ్నోత్తరాల సమయంలో గట్టిగా జవాబిచ్చిన మంత్రి పొన్నం**

**హైదరాబాద్,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్టీసీపై చర్చ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య మాటల యుద్ధం సాగింది. గత ప్రభుత్వం ఆర్టీసీని చంపాలని చూసిందని పొన్నం ఆరోపించారు. ఆర్టీసీ యూనియన్లను గత ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. రూ. 280 కోట్ల బకాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీకి చెల్లించిందని తెలిపారు. హరీశ్ రావు వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయన్నారు. హరీష్ రావు ఆర్టీసీ గౌరవాధ్యక్షులుగా ఉన్నారని గుర్తు చేశారు. రిటైర్డ్ ఆఫీసరైన వాళ్ల బంధువును ఎండీగా పెట్టుకుని ఆర్టీసీని ఆగం చేశారని ఆరోపించారు. సమ్మె సమయంలో ఆర్టీసీ ఉండదని బెదిరించారని కార్మికులను బెదిరించారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక మూడు వేల ఉద్యోగాల భర్తీకి నిర్ణయం తీసుకొని నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. అప్పుడు ఫైనాన్స్ మంత్రిగా ఉన్న హరీశ్ రావు బడ్జెట్ లో రూ. 1500 కోట్లు కేటాయించి 400 కోట్లు కూడా ఇవ్వలేదన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, జాగాలను లీజులకు తీసుకు బకాయిలు కూడా కట్టేదని విమర్శించారు. దీనిపై సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు స్పందిస్తూ.. ఆర్టీసీ యూనియన్లపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ కు లేదన్నారు. ఆర్టీసీలో తమ పార్టీ అనుబంధం సంఘం గుర్తింపు యూనియన్ గా ఉందన్నారు. ఖమ్మంలో ఓ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నారని, ఎంతో మంచి వ్యక్తి చనిపోయారని గుర్తు చేశారు. యూనియన్లను రద్దు చేసిన వారికి మాట్లాడే అర్హత లేదని అన్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోడియం దగ్గర బైఠాయించి నిరసనకు దిగారు. ఇదే ప్రశ్నపై సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. ఆర్టీసీ యూనియన్ కు గౌరవాధ్యక్షుడిగా ఉన్న హరీశ్ రావును తప్పించేందుకే అప్పటి సీఎం కేసీఆర్ ఆర్టీసీ సంఘాల రద్దు నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు.

## టీచర్ల బదిలీల నిలిపివేత

అమరావతి,జూలై24(పీపుల్స్ మోటివేషన్): ఉపాధ్యాయుల బదిలీలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీచర్ల అక్రమ బదిలీలు రద్దు చేస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం నాడు ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్రంలో ఫిబ్రవరి 2024 నుంచి జూన్ 2024 వరకు జరిగిన టీచర్ల బదిలీలను రద్దు చేశారు. ఏపీ విద్యాశాఖ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం టీచర్ల బదిలీలను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత కొన్ని రోజుల నుంచి టీచర్ల బదిలీలలో పారదర్శకత, జవాబుదారీతనం ఉంటుందని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెబుతూనే ఉన్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు జరిగిన ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్ల బదిలీలను రద్దు చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## హైదరాబాద్ పాతబస్తీ జియాగూడలో విషాదం

**అగ్నిప్రమాదంలో తండ్రీకూతుళ్ల మృతి**

**హైదరాబాద్,జూలై24(పీపుల్స్ మోటివేషన్) :**

హైదరాబాద్ పాతబస్తీ జియాగూడలోతీవ్ర విషాదం చోటుచేసుకున్నది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జియాగూడలోని వెంకటేశ్వరనగర్ ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తండ్రీ కూతుళ్లు మృతిచెందారు. అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఫర్నీచర్ ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు మంటలను మార్పాలనుకునేలోపే పై అంతస్తులకు వ్యాపించాయి. దీంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. పై అంతస్తుల్లో చిక్కుకుపోయిన ఏడు కుటుంబాల వారిని రక్షించారు. అయితే రెండో సఅంతస్తులో ఉన్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పోలీసలు ఉస్మానియా దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పదేండ్ల బాలిక శివప్రియ మరణించగా, మరికొద్ది సేపటికే ఆమె తండ్రి శ్రీనివాస్ కూడా మరణించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు

## పదేళ్ల తర్వాత అసెంబ్లీలో ప్రజాస్వామ్యం

**సమస్యలపై చర్చించేలా అవకాశం : మంత్రి సీతక్క**

**హైదరాబాద్,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

పదేళ్ల తర్వాత అసెంబ్లీలో ప్రజాస్వామ్యం కనిపిస్తోందని, బీఆర్ఎస్ హయంలో శాసనసభలో ప్రొటెస్ట్ చేస్తే సస్పెండ్ చేసే వారని, తెలంగాణ ఏర్పడిందే నియామకాల మీదని అలాంటి నియామకాలపై అధికారంలో వున్నపుడు బీఆర్ఎస్ స్పందించలేదని మంత్రి సీతక్క ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ లాబీలో మంత్రి మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం రాగానే 30 వేల ఉద్యోగాలతో పాటు, జాబ్ నోటిఫికేషన్‌లు ఇచ్చామన్నారు. అధికారం పోయాక బీఆర్ఎస్ నేతలకు నిరుద్యోగులు గుర్తుకు వచ్చి ప్రొటెస్ట్ చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్లుగా ఉద్యోగాల భర్తీని పట్టించుకోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ కోసం డిమాండ్ చేయడం విడ్డూరమన్నారు. అసెంబ్లీ పోడియంలోకి వెల్లినా.. ప్లకార్డులు ప్రదర్శించినా.. గత ప్రభుత్వం సస్పెండ్ చేసేదని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అలా చేయడంలేదని మంత్రి సీతక్క అన్నారు. గతంలో నిరసనలను అణగదొక్కిన బీఆర్ఎస్.. ఇప్పుడు నిరసనకు దిగడం ఆశ్చర్యకరమన్నారు. బీఆర్ఎస్ నిరసనలతో రాష్ట్రంలో ఎంత ప్రజా స్వామ్యం వుందో అర్థం అవుతుందని, ఉద్యోగాల భర్తీలో వున్న చిక్కు ముడులను విప్పి నియామకాలు చేపట్టామని చెప్పారు. త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారామె. తండాల్లో జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా చర్యలు చేపడుతున్నామని, తండాలను రెవెన్యూ గ్రామాలుగా మార్చే అంశం చర్చిస్తున్నామన్నారు. 1936 నాటి రెవెన్యూ గ్రామాలే ఇంకా కొనసాగుతున్నాయని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. కాగా దివ్యాంగులపై ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ చేసిన వ్యాఖ్యలు సరికాదని, దివ్యాంగులను కించపరిచేలా ఉన్నాయని.. దీని వెనుక వేరే ఆలోచన కనిపిస్తోందని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్‌లో ఫ్యూడల్ భావజాలం ఉందని, ఆమె తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. దేవుడు ఇచ్చిన జన్మకు ఎవరు ఏం చేస్తారన్నారు. ఇప్పటికైనా అలాంటివి మానుకోవాలన్నారు. దివ్యాంగులుగా ఉన్న ఎంతోమంది గొప్ప స్థానాలకు వెళ్లారని, ఇతరుల సమర్థతను గుర్తించాలన్నారు. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## ఎంపిడివో హత్యపై సమగ్ర విచారణ

**కారకులపై చర్య తీసుకోవాలి**

**నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన**

**కాకినాడ,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

నరసాపురం ఎంపీడీవో వెంకటరమణారావు ఆత్మహత్యకు పాల్పడేలా ప్రేరేపించినవారిపై సిఐడి విచారణ నిర్వహించాలని పలువురు డిమాండ్ చేశారు. ఎంపీడీవో వెంకటరమణారావు ఆకస్మిక మృతికి నిరసనగా బుధవారం సామర్లకోట ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోలు నల్ల బ్యాడ్జీలు ధరించి సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీడీవో రమణారావు చిత్రపటం వద్ద పూలమాలవేసి నివాళులర్పించారు. సామర్లకోట ఎంపీడీవో శ్యాంసుందర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ సంఘటన ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యం పై మాయని మచ్చలా మిగిలిందన్నారు. బోటు కాంట్రాక్టర్ రూ.54 లక్షల చెల్లించకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఎంపీడీవోను ఆత్మహత్యకు పాల్పడేలా ప్రేరేపించారని తన భార్యకు సందేశంలో చెప్పి జూలై 16న పుట్టినరోజు నాడే తన జీవితాన్ని ముగించుకునేలా చేశారన్నారు. బాధ్యులపై సిఐడి విచారణ నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఈవోపీఆర్డి కర్రి హరికఅష్ణ సత్యారెడ్డి, కార్యాలయం ఏవో మంగతాయారు, మండల పరిధిలో గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## కళ్లకు గంతలు కట్టుకుని రాక్ కార్మికుల నిరసన

**విజయవాడ,జూలై24(పీపుల్స్ మోటివేషన్):**

ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా అక్రమంగా రాక్ కార్మికులను ఉద్యోగాల్లో నుండి తొలగించి నేటితో 100 రోజులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాక్ సిరామిక్స్ కార్మికులు కళ్ళకు గంతలు కట్టుకొని, 100 రోజుల ఉద్యమం ప్లకార్డులు చేతపట్టుకొని కంపెనీ గేటు ముందు నిరసన తెలియజేశారు. కార్మికులు మాట్లాడుతూ సిరామిక్స్ కంపెనీలో 18, 20 సంవత్సరాల కాలంపాటు తమతో వెట్టి చాకిరీ చేయించుకొని కార్మికులను అర్ధాంతరంగా బయటికి నెట్టేశారన్నారు. లాభాలే పరమావధిగా పనిచేస్తున్న కంపెనీ.. కార్మికులను ఉద్యోగాల్లో నుండి తొలగించి మరిన్ని లాభాలు సంపాదించాలని ప్రయత్నిస్తుందన్నారు. ఆంధ్ర ప్రాంత కార్మికులను తొలగించి ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి వలస కార్మికులతో వెట్టి చాకిరీ చేయించడానికి చూస్తుందన్నారు. ఈ ఉద్యమం ఎంతకాలమైనా సరే కొనసాగిస్తామని సమస్య పరిష్కారమే ధ్యేయమని కార్మికులు స్పష్టం చేశారు. తమ సమస్యలను పరిష్కారం చేయకపోతే కుటుంబాలతో వంటావార్పు గేటు ముందే చేస్తామని. కార్మికులను సమీకరించి సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతి కుమార్, కార్మికులు చంద్రశేఖర్ గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జున్, మంగారావు, అర్జున్ , మూర్తి, సత్యనారాయణ, చంద్రన్న, ప్రభుదాస్, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్ కుమార్, శివ, నారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
పీపుల్స్ మోటివేషన్
People's Motivation



# ఎన్టీఆర్‌తో డ్యాన్స్ చేయడం అంటే ఇష్టం: జాన్వీ


బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ ఎన్టీఆర్‌పై ఆసక్తికర కామెంట్స్ చేశారు. హిందీలో ఆమె నటించిన 'ఉలజ్' చిత్ర ప్రమోషన్లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అమితాబ్ బచ్చన్, హృతిక్ రోషన్, విక్కీ కౌశల్ వీరిలో ఎవరితో డ్యాన్స్ చేయాలని ఉందని అడగ్గా.. తనకు ఎన్టీఆర్‌తో కలిసి డ్యాన్స్ చేయాలనుందని మనసులో మాట బయటపెట్టారు. ప్రస్తుతం ఆమె తారక్‌తో కలిసి 'దేవర'లో నటిస్తున్నాను. ఎన్టీఆర్‌తో కలిసి ఓ పాట షూటింగ్ పూర్తయింది. 'తారక్‌తో కలిసి ఓ పాటకు స్టెప్పులేశా. అతని డాన్స్ లో ఈజ్ బావుంది. ఎనర్జిటిక్ హీరో. అతని సపోర్ట్‌తో నేను కూడా అలవోకగా డాన్స్ చేశాను. అమ్మ మంచి డాన్సర్. నాకు కూడా డాన్స్ అంటే ఇష్టం. తారక్‌తో కలిసి స్టెప్పులేశాక మరింత ఉత్సాహం పెరిగింది. ఇప్పుడు రెండో పాట చిత్రీకరణ కోసం, ఆ సమయం ఎప్పుడొస్తుందా అని ఆతురతగా చూస్తున్నా' అని జాన్వీకపూర్ చెప్పారు. సముద్రతీరం నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామా ఇది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్ ఊరమాస్ అవతారంలో కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆయన అభిమానులు, సినీ ప్రియులు ఎంతగా ఎ÷-జగైటింగ్‌గా ఎదురుచూస్తున్నారు. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా కనిపించనుండగా.. కీలక పాత్రలో శ్రీకాంత్‌లో నటిస్తున్నారు. శివ కొరటాల రెండు పార్టులుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగాన్ని సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.







## ధనుష్ రాయన్ మూవీపై ఉత్కంఠ

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కాంపౌండ్ నుంచి వస్తోన్న క్రేజీ చిత్రాల్లో ఒకటి రాయన్, ధనుష్ స్వీయ దర్శకత్వంలో వస్తోన్న ఈ మూవీలో టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. నార్త్ మద్రాస్ బ్యాక్ డ్రాప్‌లో సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న రాయన్ జులై 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ధనుష్ టీం ఇప్పటికే ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీగా ఉంది.తాజాగా మేకర్స్ మరో స్టన్నింగ్ లుక్ విడుదల చేశారు. నుదుటన రక్తపు మరకలు, చెంపకు బ్యాండేజ్‌తో సీరియస్ అవతార్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌లో జోష్ నింపుతున్నాడు ధనుష్. ఇక తమిళనాడు వ్యాప్తంగా అడ్వాన్స్ బుకింగ్స్ హాట్ కేక్‌లా మారిపోయాయి. కర్ణాటకలో ధనుష్ కెరీర్‌లో అత్యధిక థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలవుతున్న సినిమాగా అరుదైన ఫీట్ నమోదు చేసింది. మేకర్స్ ఇప్పటికే విడుదల చేసిన రాయన్ ఫస్ట్ లుక్‌తోపాటు ఎస్‌జే సూర్య పోస్టర్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రంలో అపర్ణ బాలమురళి, దుషారా విజయన్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్, విష్ణువిశాల్, కాళిదాస్ జయరామన్, సందీప్ కిషన్, సెల్వ రాఘవన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డీ50వ (ఆ50)గా వస్తోన్న ఈ మూవీకి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ మూవీని తెలుగులో ఏసియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పీ రిలీజ్ చేయనుంది. రాయన్ ట్రైలర్‌ను ఇటీవలే లాంచ్ చేయగా.. హై ఓల్టేజీ యాక్షన్ పార్టుతో సాగుతూ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తుంది.




## యాక్షన్ సినిమాల్లో కిల్ ప్రత్యేకం

'స్నోఫియర్', 'కిల్'.. రెండూ వేర్వేరు కథలు. రెండింటిలోనూ ట్రైన్‌లో యాక్షన్ సీక్వెన్స్ మాత్రమే కామన్ పాయింట్ అని చెప్పారు యాక్షన్ కొరియోగ్రాఫర్ సీ యంగ్ ఓ లక్ష్ లల్వానీ హీరోగా, తాన్య హీరోయిన్‌గా నటించిన 'కిల్' జులై 5న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మంచి టాక్, వసూళ్లు అందుకుంటున్న ఈ సినిమాకు దక్షిణ కొరియా చెందిన యాక్షన్ కొరియోగ్రాఫర్ సీ యంగ్ ఓ పని చేసిన విషయం తెలిసిందే. ఆయన ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇప్పటివరకు వచ్చిన యాక్షన్ చిత్రాలన్నిటిలో 'కిల్' ప్రత్యేకం. ఇందులో యాక్షన్ సన్నివేశాల కోసం చాలా కష్టపడ్డాం. ట్రైన్‌లో వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించడం కోసం నెలల సమయం పట్టింది. 'స్నోఫియర్', 'అవెంజర్స్'లో ఉన్న సీన్స్‌ను మరిపించేలా ఈ సినిమాలో సన్నివేశాలు ఉండాలని దర్శకుడు ముందే కోరారు. దీంతో ట్రైన్ యాక్షన్ సీన్స్‌ని సవాలుగా తీసుకొని చేశాం. ట్రైన్ లోపల ఉండే చిన్న స్థలంలో అలాంటి యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించడం కష్టం. వీటి కోసం ప్రత్యేక సెట్ వేశాం.. అయినప్పటికీ రోజూ ఎవరో ఒకరికి గాయాలయ్యేవి. అయితే ఎవరికీ ప్రమాదకరమైన గాయాలు కాలేదు' అని యంగ్ ఓ చెప్పారు.




Printed, Published and Owned by M.RAMESH, H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh State, and Printing at PSR Printers, No.87-569, Beside, Chenchureddy Apartment, Madhava nagar,Kurnool - 518002 District, Andhrapradesh, Published from H.No. H.No. 87/-569, Ground floor, Madhavanagar, Kurnool City, Kurnool - 518002, Andhrapradesh, Editor : M.RAMESH, Mob : 8008622746,E-mail : peoplesmotivation22@gmail.com